నేడు పేదింట.. పెద్ద పండుగ

8773 ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు

రాజమహేంద్రవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటికల నెరవేరుతోంది.జిల్లాలో బుధవారం 8773 ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహిస్తారని మంగళవారం జిల్లా హౌసింగ్ పీడీ నాతి బుజ్జి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తయిన ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయిస్తుండడం గమనార్హం.జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బుధవారం గృహ ప్రవేశాలు జరగనున్నాయి. అనపర్తి నియోజకవర్గంలో 776, రాజమండ్రి రూరల్‌లో 375, రాజానగరంలో 631, రాజమండ్రి అర్బన్‌లో 3097, కొవ్వూరులో 847, గోపాలపురంలో 1760 ఇళ్లలో గృహప్రవేశాలు జరగనున్నాయి.నిడదవోలులో మంత్రి కందుల దుర్గేష్,బిక్కవోలులో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, శ్రీకృష్ణపట్నంలో ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, కడియంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజమండ్రి 46వ వార్డులో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కొవ్వూరు శ్రీరామకాలనీలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నల్లజర్ల మండలం పోతవరంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో గృహ ప్రవేశాలు జరుగుతాయి.గోకవరం కామరాజుపేటలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో గృహ ప్రవేశాలు జరుగుతాయి.

విజన్ చంద్రుడు!

- పల్లెల్లో పారిశ్రామిక పార్కులు
- మూడు నియోజకవర్గాల్లో ఏర్పాటు
- వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం

రాజమహేంద్రవరం, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి) : ఎన్నికల్లో ఏం చేస్తారో చెప్పారు.. అధికా రంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు చేసి చూపి స్తున్నారు.. తన విజనేంటో ప్రజలకు తెలియజేస్తు న్నారు. ప్రతి ఒక్కరినీ అభివృద్ధి చేసే దిశగా అడు గులు వేస్తున్నారు సీఎం చంద్రబాబు. ఇంటికో పారిశ్రామికవేత్త తయారవ్వాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం నియోజకవర్గానికో పారిశ్రామిక వాడను నిర్మించడానికి సన్నాహాలు చేస్తోంది. 2030నాటికి ఒక వ్యవస్థాప కుడు- ఒక కుటుం బం పేరుతో ప్రయత్నాలు ఆరంభించారు. అందులో భాగంగా మంగళవారం జిల్లాలో రాజమండ్రి రూరల్ ధవళేశ్వరం, గోపాలపురం నియోజకవర్గం చెరుకుమిల్లి, నిడదవోలు బసివి రెడ్డిపేటలో మూడు ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ లను సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రా మికవేత్త తయారుకావాలన్నదే తన లక్ష్యమ న్నారు. దానిలో భాగంగానే ఈ కాంప్లెక్స్‌లు నిర్మి స్తున్నామని తెలిపారు. ధవళేశ్వరంలో 2 ఎకరాల్లో రూ.15 కోట్లతో 26 యూనిట్లను నెలకొల్పే విధం గా ఎఫ్ఎఫ్‌సి నిర్మించనున్నారు.చెరుకు మిల్లిలో 13 ఎకరాల ప్రభుత్వ భూమిలో 2.5 ఎకరాల్లో ఎఫ్ఎఫ్‌సీ నిర్మించనున్నారు. నిడదవోలు బసివి రెడ్డిపేటలో 2 ఎకరాల్లో రూ.13.12 కోట్లతో 26 యూనిట్లుగా సరిపడ భవనం నిర్మిస్తారు. సుమారు 6 నెలలో ఎఫ్ఎఫ్‌సి కాంప్లెక్స్‌ను పూర్తి చేయనున్నట్టు ఏపీఐఐసీ అధికారులు తెలిపారు.



రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరంలో పారిశ్రామిక పార్కును వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు చిత్రంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘా స్వరూప్, కూటమి నాయకులు

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణిగా శ్రీదేవి



రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణిగా డాక్టర్ బి.శ్రీదేవి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా నుంచి పదోన్నతిపై వచ్చారు. ముందుగా డాక్టర్ శ్రీదేవి డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డిప్యూటీ డెమోగా పి.సత్యవతి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణిగా పనిచేసిన కోమలి పదోన్నతిపై కాకినాడ జీజీహెచ్‌కు సీఎస్ ఆర్ఎంవోగా బదిలీ అయినట్టు సమాచారం.



అధికారులకు సూచనలు చేస్తున్న అమలకుమారి

పది పరీక్షల ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదల

రాజమహేంద్రవరం/గోకవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మార్చి-2026లో నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదలైందని డీఎస్ఈవో వాసుదేవరావు తెలిపారు. అన్ని సబ్జెక్టులకు రూ.125, 3 కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, 3 సబ్జెక్టుల వరకూ రూ.110, వొకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60, వయసు నిర్ధారణకు రూ.300 ఫీజును ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ఈ నెల 13 నుంచి డిసెంబరు 25 వరకూ చెల్లించవచ్చన్నారు.ఈ నెల 26 నుంచి డిసెంబరు 3 వరకూ రూ.50, డిసెంబరు 4 నుంచి 10 వరకూ రూ.200, డిసెంబరు 11 నుంచి 15 వరకూ రూ.500 ఆలస్య రుసుంతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫీజులు https://bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న స్కూల్ లాగిన్ ద్వారా చెల్లించాలన్నారు. పదవ తరగతి ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.అమలకుమారి మంగళవారం గోకవరం మండలంలో పది పరీక్షలు నిర్వహించే కేంద్రాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

హోమ్ స్టేకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగాభివృద్ధి, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించడమే లక్ష్యంగా 'హోమ్ స్టే, బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పాలసీ 2024-2029'ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. హోమ్ స్టే యజమానులకు ఏడేళ్లపాటు నూరు శాతం ఎస్‌జీఎస్‌టీ తిరిగి చెల్లింపు, మొదటి మూడేళ్లు ఉచిత రిజిస్ట్రేషన్, విద్యుత్, నీరు, చెత్త, ఆస్తి పన్ను ధరల్లో గృహ వినియోగ రేట్లు వర్తిస్తాయన్నారు. పీఎం సూర్యఘర్ యోజన, ముద్ర పథకం ద్వారా తక్కువ వడ్డీకీ రుణాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ పథకంలో శిక్షణ, నైపుణ్యాభివృద్ధి ఉంటుందన్నారు. నమోదు, పర్య వేక్షణ బాధ్యతలు ఏపీ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో ఉంటుందన్నారు.వివరాలకు https://homestays.staging.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని..అదే వెబ్‌సైటులో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం సూచించారు.



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

గూఢసార్‌లెక్కడ!

ఉమ్మడి జిల్లాలో నిద్దరోతున్న నిఘా

మనలో ఒకడు.. మనతో పాటే ఉంటాడు.. మనలాగే ఉంటాడు..అనుపానులు చూసుకుంటాడు.. ప్రమాదాన్ని పసిగడతాడు.. ఉన్నతాధికారులకు చేరవేస్తాడు.. ప్రమాదం జరగకుండా కాపాడతాడు.. ఇదీ గూఢచారి వ్యవస్థ.. ఉమ్మడి జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ గూఢచారి వ్యవస్థ ఉంటుంది.. గతంలో అయితే వీళ్లు ఎవరనేది ఎవరికీ తెలిసేది కాదు.. ప్రస్తుతం గూఢసార్‌లెవరనేది అందరికీ తెలిసిపోతోంది.. నిఘా లేదు.. ఏం లేదు.. ప్రమాదాన్ని పసిగట్టే పనిలేదు.. బాస్‌లకు సేవ చేసుకుంటూ కొసరు పనులతో దర్జాగా గడిపేస్తున్నారు. ఢిల్లీలో బాంబ్ పేలుడు ఘటనతో దేశమంతా ఉలిక్కిపడింది..ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నిఘా వ్యవస్థపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సాంకేతికత వినియోగం.. నిఘా.. ఈ రెండు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో అత్యంత కీలకమైన భూమిక పోషిస్తాయి. యూనిఫాం వేసుకొని ఎన్నిసార్లు చక్కర్లు కొట్టినా చిక్కని వాటిని నిఘాతో పసిపగట్టి పనిపట్టవచ్చు. ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటన చూస్తే హృదయం కలచివేస్తోంది. పోలీసులు ముందుగా పసిగట్టకుండా ఏం చేస్తున్నారనే ప్రశ్న సర్వత్రా వినవస్తోంది. అయితే యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్, నిఘా వర్గాల సమన్వయంతో పెద్ద ఉపద్రవాన్ని తప్పించాయి. మారణహోమాన్ని మట్టుబెట్టాయి.మరి ఉమ్మడి జిల్లాల్లో నిఘా పటిష్టంగా ఉందా? అనే ప్రశ్నకు మేల్కోవాలనే సమాధానం వినబ డుతుండడంపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

- ఢిల్లీ బాంబ్ పేలుడుతో ఉలిక్కిపడిన జిల్లా
- పోలీసుల తనిఖీలతో భయం..భయం
- కొసరు పనుల్లో ఉమ్మడి జిల్లా నిఘా విభాగం
- ప్రమాదాలను పసిగట్టలేని వైనం

నిఘా విభాగం.. ఏం చేస్తుందంటే..

ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో నిఘా విభాగాల పాత్ర కీలకం. పూర్వం వీళ్లను వేగులు,గూఢచారులు అని పిలిచేవారు. పోలీసుల్లో విజిబుల్ పోలీస్..యూనిఫాం వేసుకొని తనిఖీలు చేస్తుంటారు.యూనిఫాం లేకుండా ప్రజల్లో కలిసిపోయి తీగ లాగడం, కీలక సమాచారాన్ని ఒడిసిపట్టుకోవడం నిఘా విభాగాల (ఇన్‌వి జిబుల్ పోలీసింగ్) ప్రధాన విధి. దీని ద్వారా ముందస్తు చర్యలకు మార్గం దొరుకుతుంది. చిన్న నేరాలను నుంచీ భారీ కుట్రలను భగ్నం చేయడం వరకూ వీళ్ల చేతల్లోనే ఉంటుంది. ఢిల్లీ బాంబు పేలుళ్లకు రెండు రోజుల ముందు కీలకమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. గుజరాత్ ఏటీఎస్ పోలీసుల నిఘా విభాగం ఇచ్చిన సమాచారం ఆధారంగా జమ్ముకశ్మీర్, ఉత్తరప్రదేశ్ పోలీసులు, కేంద్ర ఏజెన్సీలు సంయు క్తంగా ఆపరేషన్ నిర్వహించి ఉగ్రవాదులను అరెస్టు చేశారు. భారీ కుట్రను భగ్నం చేశారు.ఇది కేవలం నిఘా విభాగాల వల్లనే సాధ్యపడింది.

నిఘా పెరగాలి..

ఉమ్మడి జిల్లాలో ఎన్నో కీలకంగా ఉన్నాయి.. పోలవరం ప్రాజెక్టు, గోదావరిపై వంతెనలు, పలు ఫ్యాక్టరీలు, ప్రధాన నగరాల్లో సాయంత్రం వేళ జనసమ్మర్థత ఎక్కువే. మెయిన్‌రోడ్లు కిటకిటలాడుతూనే ఉంటాయి. రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌ల వద్ద ఈనాటికి మెటల్ డిటెక్టర్ వ్యవస్థ అనేది లేదు. రోజూ సుమారు 40 వేల మంది ప్రయాణించే రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు అయితే చాలా దారులున్నాయి. అయినా నిఘా లేదు. కార్తీక మాసం కావడంతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. అక్కడా ఇంతే.

కొసరు పనులతో సరి

పోలీసు శాఖలో ఉండే నిఘా విభాగం కీలకంగా వ్యవహరించాల్సి ఉన్నా అందుకు భిన్నం గా కొసరు పనులు వారికి ఎక్కువైపోయాయనే విమర్శలు ఉన్నాయి. ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ నిఘా(స్పెషల్ బ్రాంచ్-ఎస్‌బీ) పోలీస్ ఒకరు ఉంటారు. జిల్లా స్థాయిలో నిఘా సీఐ, డీఎస్పీకి నేరుగా వీరు సమాచారాన్ని చేరవేస్తూ ఉంటారు. వాళ్ల ద్వారా జిల్లా పోలీస్ బాస్ అయిన ఎస్పీకి.. అవసరమైతే అక్కడి నుంచి పైఅధికారులకు సమాచారం వెళుతుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో దాదాపు 75 పోలీస్ స్టేషన్లలోనూ నిఘా పోలీసులు ఉన్నారు. అయితే అధికశాతం వీళ్లందరూ జేబులు నింపు కోవడానికి పాస్‌పోర్టుల తనిఖీలు, ఇతర వ్యవహారాల్లో తల మునకలైపోయారు. ఎస్పీలకు భజన చేయడం, ఉన్నతాధికారుల సమావేశాలకు ఏర్పాట్లు చేయడం, ఆహార మర్యాదల్లో కొరత రాకుండా చూసుకోవడంలో నిమ గ్నమవుతున్నారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం, చివరికి ఉన్నతాధికారి సమావేశంలో కుర్చీ తక్కువైతే వెంటనే రప్పించడం కూడా నిఘా అధికారుల పనిగానే మారిపోయింది.దీంతో అసలు విధులకు సమయం చిక్కడం లేదు. జిల్లాలోని ఎస్పీకి నేరుగా అనుసంధానమై ఉండే ఎస్‌బీ పోలీసులంటే ఆయా పోలీస్ స్టేష న్లలోని సీఐ, డీఎస్పీ స్థాయి అధికారులు భయ పడుతూ ఉండే పరిస్థితి ఉంది. మూడు జిల్లా ల్లోని ఒక జిల్లాలో పరిస్థితి మరీ అధ్వానంగా తయారైందనే ఆరోపణలు ఉన్నాయి. ఎస్పీకి దగ్గరగా ఉండే ఎస్‌బీ అధికారులు సీఐలు, ఎస్ ఐలను బెదిరిస్తూ తమ 'కార్యకలాపాలు' చక్క బెట్టుకుంటున్నారు.



ఇప్పటికైనా ఓ కన్నేసి..

ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యమే కాకుండా ఇప్పటికైనా నిఘా విభాగాలను ఉన్నతాధికారులు పూర్తిగా పరిశీలించి ప్రక్షాళన చేయాల్సిన అవసరత కనిపిస్తోంది. పోలీస్ స్టేషన్లు, ఎస్పీల వద్ద భజన యూనిఫాంలకు స్వస్తి చెప్పి అనుభవం,నిబద్ధత ఉన్న వారిని నియమించా ల్సిన అవసరత కనిపిస్తోంది. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, రద్దీ ప్రదేశాల్లోని పార్కింగ్ ప్రాంతాల్లో నిఘా పోలీసులను నిరంతరాయంగా వినియోగించాలి. నిఘా (ఎస్‌బీ) విభాగం పోలీసుల పనితీరును బేరీజు వేస్తూ కనీసం నెలకో సారి అయినా సమీక్షిస్తూ ఉండాలి.కీలక సమాచార సేకరణ, వాటిని ఉన్నతాధికా రులకు నివేదించడం, ప్రజల్లో మమేకమై సమాచారా న్ని సేకరించడం, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వంటి వాటిపై శిక్షణ ఇప్పించాలి. కొసరు పనులను పక్కన పెట్టించాల్సిన అవసరత కనిపిస్తోంది.

టీడీపీలో పదవుల సంబరం

నాయకుల ప్రమాణ స్వీకారోత్సవాలు ఆరంభం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అధికార తెలుగుదేశం పార్టీలో సంస్థాగత సందడి మొదలైంది. మే నెలలో మహానాడు నుంచి కమిటీల నియామకం జరిగిన సంగతి తెలిసిందే. కేవలం జిల్లా కమిటీ మినహా ఏడు నియెజకవర్గాల్లోనూ పట్టణ, మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీలు, వాటి అను బంధ సంఘాల ప్రమాణ స్వీకారాలు మంగళవారం నుంచి గురువారం లోపు పూర్తి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ పిలుపు ఇచ్చారు. ఎమ్మెల్యేలు,నియోజకవర్గ ఇన్‌చార్జీలతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాలను పండుగలా జరపాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. త్వరలో జిల్లా కమిటీని ప్రకటించనున్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా రుడా ఛైర్మన్, రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ పేరు ఖరారయ్యే అవకాశం ఉన్నట్టు పార్టీ శ్రేణుల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం మిగతా కమిటీల ప్రమాణ స్వీకారాలు మొదలయ్యాయి. ఒక్కో నియోజకవర్గంలో సుమారు 900 నుంచి 1500 మందికి వివిధ స్థాయిల్లో పార్టీ పదవులు దక్కాయి. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు అతిథి గృహం వద్ద నియోజకవర్గంలోని మండల పార్టీ,గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో మంగళవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రమాణస్వీకారం చేయించారు.కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు మండలంలోని కమిటీల ప్రమాణ స్వీకారం మంగళవారమే జరిగింది. కొవ్వూరు పట్టణ, మండల కమిటీల ప్రమాణ స్వీకారం బుధవారం జరగనుంది. తాళ్లపూడి మండల కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం జరనుంది. మిగతా నియోజకవర్గాల్లో నియోజకవర్గ కమిటీలతో ఒకేసారి ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.రాజమహేంద్రవరం సిటీ, రాజానగరం,అనపర్తి నియోజకవర్గంలోని కమి టీలు ప్రమాణ స్వీకారం బుధవారం జరగనుంది. రాజమండ్రి రూరల్,నిడదవోలు కమిటీలకు మాత్రం గురువారం నిర్వహించనున్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితరులు

తల్లిదండ్రుల ఆశలకు విలువ ఇవ్వాలి

నన్నయ వర్శిటీ వీసీ ప్రసన్న శ్రీ

దివాన్‌చెరువు, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): విద్య ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ కష్టించి చదువుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. భారత తొలివిద్యశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. తొలుత వీసీ ప్రసన్నశ్రీ, విశ్వవిద్యాలయ అధికారులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ తల్లి దండ్రుల ఆశలకు విలువనిచ్చి ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు.ప్రభుత్వ విద్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ తొలివిద్యాశాఖ మంత్రిగా చేసిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఎ.మట్టారెడ్డి, వర్శిటీ అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అంతటా అప్రమత్తం



రాజమహేంద్రవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యంలో సోమవారం రాత్రి నుంచీ హైఎలర్ట్ అమలవుతోంది. ఈ క్రమంలో ఎస్పీ నరసింహ కిషోర్ జిల్లా పోలీసులను అప్రమత్తం చేశారు. మంగళవారం ఆయన జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. రైల్వే స్టేషన్ ఏరియా, ధవళేశ్వరం, బ్యారేజీ, కొవ్వూరు, గామన్ బ్రిడ్జి తదితర ప్రదేశాల్లో పరిశీలన చేశారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, లాడ్జీలు, హోటళ్లు, అనుమానిత ప్రదేశాలు, జనసమ్మర్థం ఉన్న ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లతో నిరంతర తనిఖీలు చేయాలని నిర్దేశించారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్



లారీపై..భారీగా!



ఏంటీ నీటిలో ఉండాల్సిన పడవ లారీ ఎక్కిందని చూస్తున్నారా..! 18 చక్రాల లారీపై భారీ డ్రెజ్జింగ్ పడవను మంగళవారం విజయవాడ నుంచి కొవ్వూరు తీసుకువచ్చారు. ఎందుకో తెలుసా.. ఇంకెందుకు ఇసుక తవ్వకాలకేనండోయ్.. ఇంతవరకు అటు రాజమహేంద్రవరం, ఇటు కొవ్వూరులలో ఇసుక తవ్వకాల్లో వినియోగించే పడవల్లో ఇదే పెద్దది కావచ్చు. ఎందుకంటే ప్రస్తుతం బోట్స్‌మేన్ సొసైటీలు ఇసుక త్రవ్వకాలు చేపట్టే పడవలు 5నుంచి 6 పడవలు తీసుకువచ్చే ఇసుకను ఈ ఒక్క పడవే తీసుకువస్తుందని పడవ యజమానులు చెప్పుకుంటున్నారు. - కొవ్వూరు

అపార్ ఐడీతో మెరుగైన సేవలు

నన్నయ యూనివర్శిటీ వీసీ ప్రసన్నశ్రీ



జ్యోతిప్రజ్వలనతో వర్క్‌షాపును ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ రిజిస్ట్రీ(అపార్) ఐడీ ద్వారా మెరుగైన సేవలు పొందవచ్చునని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో అపార్ వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి ఏబీసీ నోడల్ అధికార్లు, కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్స్ దాదాపు 300 మంది హాజరయ్యారు. నన్నయ పరీక్షల డీన్ ఆచార్య డి.కళ్యాణి కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి వీసీ ప్రసన్నశ్రీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అపార్ అమలుపై ఎన్ఈపీ-2010 కింద విన్నూతమైన, పరివర్తన కలిగించే ప్రక్రియ మొదలైందన్నారు. ప్రతి అభ్యాసకుడికి జీవితాంతం ప్రత్యేకమైన 12 అంకెల గుర్తింపు సంఖ్యగా భావించబడే అపార్ ఐడీ ఒక దేశం, ఒక విద్యార్థి, ఒక గుర్తింపు దార్శనికతను ప్రతిబింబిస్తుందన్నారు. విద్యాసౌలభ్యంతోబాటు పరిపాలనా సౌలభ్యాన్ని అపార్ పెంచుతుందన్నారు. డిజిలాకర్ ద్వారా సురక్షిత యాక్సస్ ద్వారా మార్క్‌షీట్లు, సర్టిఫికెట్లు, డిగ్రీల తక్షణ డిజిటల్ ధ్రువీకరణను ప్రారంభించడం ద్వారా భౌతిక డాక్యుమెంట్లపై ఆధారపడడం తగ్గిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలలు అపార్ వ్యవస్థను దేశవ్యాప్తంగా అమలు చేయడంలో చురుకుగా పాల్గొంటున్నాయని చెప్పారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రిన్సిపాల్ పి.అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అపార్ ఐడీలు నూరుశాతం పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆయా జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు అందరూ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ సమాచార మంత్రిత్వ శాఖ ప్రాంతీయ కోఆర్డినేటర్ రవి పాండే మాట్లాడుతూ ఆధార్ ఆధారిత ఇ-కెవైసి ధ్రువీకరణ ద్వారా అపార్ ఐడీలను ఉత్పత్తి చేసి ప్రతివిద్యార్థి డిజిలాకర్ ఖాతాకు లింక్ చేస్తున్నారని చెప్పారు. విద్య మౌలిక సదుపాయాలను అమలు చేయడంలో మన రాష్ట్రం ప్రగతిశీల రాష్ట్రాల్లో ఒకటిగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. కార్యక్రమంలో యాప్సీ అకడమిక్ కన్సల్టెంట్ బి.ఎల్లారెడ్డి, శ్రీకాంత్, నన్నయ పరీక్షల డీన్ ఆచార్య డి.కళ్యాణి, పరీక్షల కంట్రోలర్ ఎస్.లింగారెడ్డి, అడిషనల్ కంట్రోలర్ కె.దీప్తి, సహాయ రిజిస్ట్రార్ ఎస్.విజయకుమారి, సిస్టమ్ మేనేజర్ ఏపీఎం జ్యోతి పాల్గొన్నారు.

ఏలేరు ఆధునికీకరణపై బహిరంగ చర్చకు రావాలి

వైసీపీ నేతలకు మాజీ ఎమ్మెల్యే వర్మ సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏలేరు ఆధునికీకరణకు కృషి చేసింది ఎవరు, అడ్డుకుంది ఎవరు అనే విషయంపై బహిరంగ చర్చకు రావాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ వైసీపీ నేతలకు సవాల్ చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలేరు తదితర అంశాలపై కాకినాడ మాజీ ఎంపీ వంగా గీత చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏనాడూ పిఠాపురం ప్రజలను పట్టించుకోని గీత ఇప్పుడు చుట్టపుచూపుగా వచ్చి వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏలేరు ఆధునికరణ ఫేజ్-1 పనులను టీడీపీ ప్రభుత్వ హయాంలో 75శాతం పూర్తి చేశామని, ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణ పనులకు టెండర్ పూర్తి చేసి సీఎం చంద్రబాబుతో శంకుస్థాపన చేయించి పనులు ప్రారంభించామన్నారు. అయితే వైసీపీ నేతలు కుట్రపన్ని జగన్ ద్వారా సదరు పనులు రద్దు చేయించారని విమర్శించారు.ఐదేళ్ల పాలనలో ఒక డుగు ముందుకు పడకపోగా, పనులను రద్దు చేసి నిధులు మురిగిపోయేలా చేశారన్నారు. సమావేశంలో ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, బొజ్జా సతీష్, కొండేపూడి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అప్రెంటిస్ అభ్యర్థులకు

రాత పరీక్ష, ఇంటర్వ్యూలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ ఉత్తీర్ణులైన అర్హులైన అభ్యర్థుల కోసం ఈనెల 13న ఉదయం 8 గంటల నంచి తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరు ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటీస్ మేళా కోసం రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాల్ వర్మ మంగళవారం తెలిపారు. రాజమహేంద్రవరంలోని ప్రముఖ సంస్థ ఏపీ పేపర్ మిల్స్‌లో పనిచేయడానికి ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, వెల్డర్, టర్నర్ ట్రేడులలో ఐటీఐ పూర్తి చేసిన వారు అప్రెంటిస్‌కు అర్హులని తెలిపారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలు ద్వారా ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక సెట్ జిరాక్స్ కాపీ, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ అప్రెంటిస్ ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో కాకినాడ మాస్టర్ స్విమ్మర్ల సత్తా



విజేతలను అభినందిస్తున్న డీఎస్డీవో సతీష్‌కుమార్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన 6వ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2025లో కాకినాడ జిల్లా క్రీడాకారులు సత్తా చాటారని డీఎస్‌డీవో సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మంగవారం ఆయన కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని స్విమ్మింగ్ పూల్‌ను సందర్శించారు. డీఎస్ఏ తరఫున రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి విజేతలుగా నిలిచిన మాస్టర్ స్విమ్మర్లను ఆయనతోపాటు కోచ్ అప్పలనాయుడు అభినందించారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు పూర్తి సహాయ సహకారాలు

కాకినాడ ఎంపీ ఉదయ్



ఎంపీ ఉదయ్‌ను కలిసిన ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు, పీడీలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడలకు తన పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన్ను ఎస్‌జీఎఫ్ కాకినాడ జిల్లా అడ్మిన్ కార్యదర్శి పి.సుధారాణి, కాకినాడ డివిజన్ కో-ఆర్డినేటర్ లంకా జార్జి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. కాకినాడలో స్క్వాష్, జూడో, అండర్-17 బాలురు ఖోఖో, అండర్-14, 17, 19 బాలబాలికలకు జిమ్నాస్టిక్స్, అండర్-11, 14, 17, 19 బాలబాలికలకు స్కేటింగ్, అండర్-19 బాలబాలికలకు హాకీ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఎంపీకి వివరించారు. స్క్వాష్, జూడో పోటీలు పూర్తయ్యాయని, మిగిలిన నాలుగింటిని వచ్చేనెల 10వ తేదీలోపు పూర్తిచేస్తామని తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవ్వాలని ఆహ్వానించగా తప్పక వస్తారని ఎంపీ తెలియజేసినట్టు వారు చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రవిచక్రవర్తి, పీడీలు ఇమ్మాన్యుయల్ రాజు, సురేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని ఢీకొన్న బైక్

చికిత్స పొందుతూ మృతి..

మృతుడు మొక్కలతిప్ప వాసి

రాజానగరం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : రాజానగరంలో ద్విచక్ర వాహనం ఢీకొని గాయపడ్డ బోనం సూర్యనారాయణ(70) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఉదయం మృతిచెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం మొక్కలతిప్ప గ్రామానికి చెందిన సూర్యనారాయణ రాజానగరంలో నివాసం ఉంటున్న కుమారుడి ఇంటికి ఐదురోజుల క్రితం వచ్చాడు. సోమవారం సాయంత్రం నడచి వెళ్తున్న సూర్యనారాయణను రాజానగరం ఊరిలో నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలైన సూర్యనారాయణను తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్టు పోలీస్‌లు తెలిపారు. ఈ మేరకు మృతుడి కుమారుడు ముత్యాలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జాతీయ పోటీలకు భోగాపురం విద్యార్థినుల ఎంపిక



పిఠాపురం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోటీలకు పిఠాపురం మండలం భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో అంతర జిల్లాల స్క్వాష్ పోటీల్లో అండర్-14 విభాగంలో జి.స్తుతి కీర్తన, అండర్-17 విభాగంలో ఆర్.వేణు ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. వీరు రాబోయే జనవరి 9 నుంచి 15వ తేదీ వరకూ ఢిల్లీలో జరిగే జాతీయ స్క్వాష్ పోటీల్లో ఏపీకి ప్రాతినిధ్యం వహిస్తారు. ఎంపికైన బాలికలను, శిక్షణ ఇచ్చిన పీఈటీ సాయిజ్యోతిని పాఠశాల హెచ్ఎం సీహెచ్.సత్తిబాబు, విద్యాకమిటీ చైర్మన్ తోట ఆనందప్రసాద్, సర్పంచ్ నేపాల లక్ష్మి, ఎంపీటీసీ వెన్నపు నీలవేణి, డీవైఈవో సత్యనారాయణ, ఎంఈవోలు అభినందించారు.

అబ్బో! ఎంత పొడుగో!



మలికిపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దిండి గ్రామ సర్పంచ్ ముదునూరి శ్రీనివాస రాజు తన పెరట్లో పెంచిన అరటి చెట్టు సుమారు ఏడు అడుగుల పొడువున గెల వేసింది. ఇది చూడడానికి ఎంతో ఆకర్షణీయంగా ఉంది. తమ బంధువులు మాల్దీవుల నుంచి అరటి మొక్కను తీసుకురాగా వారి వద్ద నుంచి ఒక పిలకను సేకరించి తన పెరట్లో వేసినట్టు రాజు చెప్పారు. ఇది తయారు కావడానికి సుమారు సంవత్సర కాలం పడుతుందని, పది అడుగుల వరకు గెల పెరుగుతుందని తెలిపారు. ఇది చూడడానికి ఎంతో ఆకర్షణీయంగా ఉంటుందన్నారు. దీనిపై కొవ్వూరు అరటి పరిశోధన సంస్థ సైంటిస్ట్ కె.రవీంద్రను వివరణ కోరగా ఇది పిసంగ్ సెరిబు రకం. ఈ రకములో మొగ పువ్వు ఉండకపోవడం వల్ల గెల అంతా ఆడ పువ్వులు(అరటి కాయలు) వచ్చి ఆకర్షణీయంగా కనపడుతుందన్నారు. ఇది మలేషియా, ఇండోనేషియాల్లో పెరుగుతుందని, దీన్ని అలంకరణ కోసం వాడతారు. ఈ గెలలో 200 పైబడి అత్తాలు, సుమారు వెయ్యి కాయల వరకు ఉంటాయని తెలిపారు.

రెవెన్యూ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్

రన్నరప్ తూర్పు



రన్నరప్ బహుమతి అందుకుంటున్న తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ క్రీడాకారులు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని ఆర్‌డీటీ స్టేడియంలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకూ జరిగిన 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ స్పోర్ట్సు అండ్ కల్చరల్ మీట్-2025లో తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ విభాగం జట్లు పలు విభాగాల్లో రన్నర్ అప్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో కడియం తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్, రాజానగరం సీఎస్‌డీటీ జి.బాపిరాజు జట్టు రన్నర్ అప్‌గా నిలిచారు. వాలీబాల్ లోనూ జిల్లా జట్టు రన్నర్ అప్‌లో నిలిచింది. స్పీడ్‌వాకింగ్‌లో రాజానగరం సీఎస్‌డీటీ జి.బాపిరాజు ద్వితీయస్థానం సాధించారు. ఈ సందర్భంగా క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన జిల్లా రెవెన్యూ అధికారులు, ఉద్యోగులను కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘా స్వరూప్ అభినందిస్తూ క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక ఆరోగ్యం పెరుగుతుందని, మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. విధి నిర్వహణలోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు

అనూ ఇమ్మాన్యుయేల్



'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో




కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది

- అక్కినేని నాగార్జున



'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్,శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రేలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

క్షేమంగా దొరికింది!



బాలికను తల్లికి అప్పగిస్తున్న అమలాపురం డీఎస్పీ ప్రసాద్, సీఐ వీరబాబు

- బాలికను కాపాడిన మాలధారులు
- అమలాపురంలో కిడ్నాప్ అయిన బాలిక
- పి.గన్నవరం మండలం యర్రంశెట్టి వారి పాలెం వద్ద ఆచూకీ గుర్తింపు
- తల్లికి అప్పగించిన పోలీసులు
- పరారీలో కిడ్నాపర్

అమలాపురం/పి.గన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో కిడ్నాప్ అయిన పదేళ్ల బాలికను పి.గన్నవరం మండలం యర్రంశెట్టివారిపాలెం వద్ద కొందరు మాలధారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాలికను త ల్లికి క్షేమంగా అప్పగించడంతో కథ సుఖాంతమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మెయిన్‌రోడ్డులో నివాసం ఉంటున్న వైసీపీ నాయకుడు కముజు రమణ కుమార్తె నిషిత (10) ఇంటికి సమీపంలోనే ఉన్న ఓ ప్రైవేటు స్కూలులో 5వ తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం స్కూలు నుంచి రమణ సమీప బంధువైన పి.గన్నవరం మండలం ముంగండకు చెందిన మట్టపర్తి మీరా సత్యమూర్తి (చంటి) బాలికకు మాయమాటలు చెప్పి మోటారుసైకిల్ ఎక్కించుకుని తీసుకెళ్లిపోయాడు. పాప ఇంటికి రాకపోవడంతో స్కూలు యాజమాన్యాన్ని ఆరా తీసిన కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యమూర్తి బాలికను కాకినాడ తీసుకెళ్లి సెల్‌ఫోన్, సిమ్ కార్డు కొనుగోలు చేసే క్రమంలో బాలిక ఏడవడంతో అక్కడి నుంచి ఉడాయించాడు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా కాకినాడ, అమలాపురం పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే కిడ్నాపర్ కాకినాడ నుంచి మండపేట, రావులపాలెం మీదుగా పి.గన్నవరం మండలంలోని ఆర్.ఏనుగుపల్లి శివారు కారుపల్లికి చేరుకున్నాడు. అక్కడ రాత్రి ఓ కొబ్బరితోటలో బాలికతో దాక్కున్నాడు. స్కూలు బ్యాగులు, షూలు వదిలి కాలినడకన ఆర్.ఏనుగుపల్లి నుంచి వేకువజామునే బయలుదేరి పి.గన్నవరం జంక్షన్ మీదుగా బెల్లంపూడి దగ్గరలోని యర్రంశెట్టివారిపాలెనికి బాలికను తీసుకెళ్లాడు. ఆ సమయంలో అటుగా వెళుతున్న ముంగండకు చెందిన కొందరు మాలధారులు సోషల్ మీడియా ద్వారా బాలిక కిడ్నాప్ విషయం తెలియడంతో ఆ బాలికను గుర్తుపట్టి సత్యమూర్తిని ప్రశ్నించడంతో బాలికను వదిలేసి పరారయ్యాడు. అప్పటికే పోలీసులకు సమాచా రం అందడంతో బాలికను తల్లికి అప్పగించారు. బాలిక ఆచూకీ కోసం కృషి చేసిన డీఎస్పీ ప్రసాద్, అమలాపురం సీఐ వీరబాబు, సిబ్బందిని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అభినందించారు. బాలిక సత్యమూర్తికి వరుసకు మేనకోడలు అవుతుందని సమాచారం. నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.42.90 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మామిడికుదురు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీస్వామి హుండీ ఆదాయం రూ.42,90,035 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. ఆలయ ప్రధాన హుండీలను మంగళవారం లెక్కించగా 73 రోజులకు గాను రూ.42,90,035 ఆదాయంతో పాటు 4 గ్రాముల బంగారం, 35 గ్రాముల వెండి వచ్చినట్టుగా ఏసీ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమానికి పర్యవేక్షణాధికారి జిల్లా దేవాదాయ శాఖాధికారి వి.సత్యనారాయణ హాజరయ్యారు. లెక్కింపు కార్యక్రమంలో అర్చకులు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

నేడు సత్యదేవుడి సన్నిధిలో సత్యదీక్షాపరులతో పడిపూజ

రాత్రి 8 గంటలకు ప్రారంభం

దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు

అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 27రోజులపాటు అత్యంత నియమనిష్ఠలతో సత్యదీక్షలు స్వీకరించిన దీక్షాపరులతో పాటుగా అయ్యప్ప దీక్షాపరులతో బుధవారం రాత్రి పడిపూజా కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. రాత్రి 8 గంటలకు పడిపూజ ప్రారంభమవుతుంది. కార్యక్రమానికి దూరప్రాంత సత్యదీక్షాపరులు, గిరిజన దీక్షాపరులు ఇరుముడులు స్వీకరించి రత్నగిరికి చేరుకుంటారు. బుధవారం రాత్రికి కొండపై బస చేసి గురువారం వేకువజామున సత్యదేవుడికి ఇరుముడులు సమర్పించి దీక్షా విరమణ చేయనున్నారు. దీక్షా విరమణలకు అన్న వరం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది.

అదృశ్యమైన పదో తరగతి విద్యార్థి తల్లిదండ్రులకు అప్పగింత

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో అదృశ్యమైన పదో తరగతి విద్యార్థి యాళ్ళ నిహార్ ఆచూకీని ఎస్ఐ లక్ష్మీకాంతం కనిపెట్టి మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు. నిహార్‌ను తల్లిదండ్రులు స్కూల్‌కు వెళ్లాలని మందలించడంతో సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన విషయం తెలిసిందే. దీనిపై ఎస్ఐ లక్ష్మీకాంతం విస్తృత గాలింపు నిర్వహించి సామర్లకోటలో ఉన్న నిహార్‌ను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించి అతడి తల్లిదండ్రులు యాళ్ళ చిన్నారావు, అనంతకు అప్పగించారు.

రూ.5 లక్షల నగదు, అర కాసు బంగారం చోరీ

పెద్దాపురంలో ఘటన

పెద్దాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలోని బ్యాంకు కాలనీలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పెంకే సింహాచలం ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.5 లక్షల నగదు, అర కాసు బంగారం దోచుకెళ్లినట్టు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఇంట్లో అందరూ బంధువుల ఫంక్షన్‌కు వెళ్లడంతో ఎవరూ లేరని గమనించిన దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లో నగదు, బంగారం దోచుకెళ్లినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మౌనిక తెలిపారు.

శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నుంచి అయ్యప్పస్వామి దర్శనం కోసం శబరిమల వెళ్తున్న భక్తులకు రైల్వే శాఖ శుభవార్త అందించింది. విశాఖపట్నం, శ్రీకాకుళం రోడ్, హైదరాబాద్, కాచిగూడ, కాకినాడల నుంచి కొల్లాం, కొట్టాయంలకు పెద్దసంఖ్యలో ప్రత్యేక రైళ్ల సర్వీసులను ఏర్పాటుచేసింది. అందులో కాకినాడ నుంచి సామర్లకోట మీదుగా ఏర్పాటుచేసిన 18 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల వివరాలను రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తన కార్యాలయం ద్వారా ప్రకటించారు. భక్తుల ప్రయాణ సౌకర్యార్థం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను సామర్లకోట మీదుగా నడుపుతున్నట్టు రైల్వే ఉన్నతాధికారులు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు వచ్చిన సమచారాన్ని ఆంధ్రజ్యోతి సేకరించింది.

07109 నంబరు గల ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు కాకినాడ-కొట్టాయం మధ్య ప్రతీ సోమవారం కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరనుంది. ఈ రైలు మంగళవారం 5.30 గంటలకు కొట్టాయం చేరుకోనుంది. నవంబరు 17 నుంచి 2026 జనవరి 19 వరకూ నడవనున్న ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ నవంబరు 17, డిసెంబరు 1,8,15,22,29, జనవరి 5,12,19 తేదీల్లో 9 ట్రిప్పులుగా ప్రతీ సోమవారం నడవనుంది. ఈ రైలు కాకినాడలో మధ్యాహ్నం 1 గంటలకు బయలుదేరి సామర్లకోటకు మధ్యాహ్నం 1.20 గంటలకు చేరుతుంది. రాజమహేంద్రవరం నకు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుని నిడదవోలుకు 2.35 గంటలకు చేరుతుంది.

07110 నంబరు గల ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ కొట్టాయం-కాకినాడ మధ్య ప్రతీ మంగళవారం కొట్టాయం నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరనుంది. ఈ రైలు మరుసటి రోజు అర్ధరాత్రి 12 గంటలకు కాకినాడకు చేరుకోనుంది. నవంబ రు 18 నుంచి 2026 జనవరి 20 వరకూ నడువనున్న ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ నవంబరు 18, డిసెంబరు 2,9,16,23,30 జనవరి 6,13,20 తేదీలలో 9 ట్రిప్పులుగా ప్రతీ మంగళవారం నడువనుంది. ఈ రైలు నిడదవోలుకు రాత్రి 8.37 గంటలకు చేరుకుని రాజమహేంద్రవరానికి రాత్రి 9.22 గంటలకు, సామర్లకోటకు రాత్రి 9.52 గంటలకు, కాకినాడకు రాత్రి 12 గంటలకు చేరుతుంది.

ఈ ప్రత్యేక రైళ్లు సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలారిపెట్టయ్, సేలం, ఈరోడ్, తిరుప్పూరు, పొడనూర్, పాలక్కాడ్, త్రిస్సూర్, అలువా, ఎర్నాకుళం మీదుగా కొట్టాయం చేరుకుంటాయి. మొత్తం 1,319 కిలోమీటర్ల దూరంలో 26 స్టేషన్లలో ఆగనున్నాయి. రైళ్లల్లో ప్రయాణించే అయ్యప్ప భక్తులు తమ సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయంలో రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని పీఆర్వో కార్యాలయం నుంచి ప్రకటించారు.

చిన్నారి తల్లి.. మనసు తల్లడిల్లి..



మృతిచెందిన చిన్నారి హరిణి

- కొడుకుని స్కూల్ బస్సు ఎక్కిస్తుండగా తల్లి వెనకాల వచ్చిన కుమార్తె
- బస్సు కింద పడి చిన్నారి మృతి

ఆత్రేయపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్ బస్సు కింద పడి ప్రమాదవశాత్తు మూడేళ్ల చిన్నారి మృతిచెందింది. వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వెలిచేరుకు చెందిన నాగిరెడ్డి రాజు- సురేఖ దంపతులకు కమారుడు పవన్, కుమార్తె హరిణి వరలక్ష్మి (3) సంతానం. పవన్ ఆత్రేయపురం మహర్షి విద్యానికేతన్‌లో ఎల్‌కేజీ చదువుతున్నాడు. మంగళవారం తల్లి సురేఖ కుమారుడు ఉదయ పవన్‌ను స్కూల్ బస్సు ఎక్కించేందుకు రోడ్డు మీదకు వచ్చింది. ఆమె వెనకాల కుమార్తె కూడా వచ్చింది. ఆ విషయం తల్లి గమనించలేదు. పవన్‌ను స్కూల్ బస్సు ఎక్కడంతో ముందుకు కదిలింది. బస్సు వెనుక వైపు హరిణి ఉన్నట్టు బస్సు డ్రైవర్ గుర్తించకపోవడంతో వెనక చక్రం కింద పడి చిన్నారి హరిణి తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతిచెందడతో సురేఖ బోరున విలపించింది. ఎస్ఐ రాము ఘటనా స్థలానికి చేరుకున్నారు. సురేఖ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. వెలిచేరులో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైల్వే స్టేషన్లో 5 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

యువకుడి అరెస్ట్

సామర్లకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌లో మంగళవారం సామర్లకోట రైల్వే పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో రూ.25 వేల విలువైన 5 కిలోల గంజాయిని సామర్లకోట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీలో జరిగిన భారీ పేలుడు నేపథ్యంలో రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానితుడిగా ఉన్న వ్యక్తి వద్ద బ్యాగ్‌లను సోదా చేయడంతో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 25 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రవాణా చేస్తున్న జార్ఖండ్‌కు చెందిన బిట్టు కుమార్‌యాదవ్ (26)ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆర్పీఎఫ్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, జీఆర్పీ ఎస్ఐ వాసు తెలిపారు. అతడిని బుధవారం విజయవాడ రైల్వేకోర్టులో హాజరుపరుస్తామన్నారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరికి గాయాలు

గండేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం పంచాయతీ రామేశ్వరంలో ఉన్న పవర్‌గ్రిడ్‌లో పనిచేస్తున్న మానస్ పాండా, నాగేంద్రకు విద్యుత్ షాక్ తగిలి గాయాలయ్యాయి. వారిని పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్టు తెలిసింది. పాండా ఒరిస్సా, నాగేంద్ర సూరంపాలెంకు చెందిన వారిగా సమాచారం.



పెద్దాపురంలో ఆసుపత్రిలో బాధితులు



బైక్ చోరీలు చేస్తున్న ముగ్గురు మైనర్ల అరెస్ట్

రూ.5 లక్షల విలువైన 6 ద్విచక్రవాహనాల స్వాధీనం : అన్నవరం ఎస్ఐ



పట్టుబడ్డ వాహనాలతో అన్నవరం పోలీసులు

అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దుర అలవాట్లకు బానిసై బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు మైనర్లను మంగళవారం కాకినాడ జిల్లా అన్నవరం జాతీయ రహదారిపై అరెస్ట్ చేసినట్టు అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల్లో వారి నుంచి రూ.5 లక్షల విలువైన 6 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురిని జువైనల్ ప్రొబేషనరీ అధికారి ముందు హాజరుపరిచినట్టు తెలిపారు.

ఇరిగేషన్ ఎస్ఈ పరిశీలన

కిర్లంపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం ముక్కోలు బెడ్ రెగ్యులేటర్ వద్ద వాలు కాలువ క్రాడ్ బండ్ కొట్టుకుపోయింది. దీన్ని మంగళవారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం ఇరిగేషన్ ఎస్ఈ గోపినాథ్ పరిశీలించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు ఏలేరు ప్రాజెక్టు ఛైర్మన్ బస్వా వీరబాబుతో కలిసి ఏలేరు వాలు కాలువ వెంబడి ఉన్న గట్లను పటిష్టం చేసేందుకు శాశ్వత పరిష్కారం చూపుతామని.. దీనిలో భాగంగా పరిశీలించడం జరిగిందన్నారు. ఇరిగేషన్ డీఈ రవికుమార్‌ను కావలసిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సూచించారు. ముక్కోలు గ్రామ సర్పంచ్ జ్యోతుల రాంబాబు, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్, అనపర్తి సూరిబాబు ఉన్నారు.



వాలుకాలువ గట్లను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ గోపినాథ్

తాళ్లూరులో సినిమా షూటింగ్



షూటింగ్ నిర్వహిస్తున్న చిత్రబృందం

గండేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండల తాళ్లూరు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం మంగళవారం సినిమా షూటింగ్‌తో సందడిగా మారింది. కన్నడ హీరో చందు, హీరోయిన్ సునీత నటిస్తున్న జాజారా చిత్ర సన్నివేశాలను డైరెక్టర్ ప్రభు చిత్రీకరించారు. గజేంద్రపుష్కరిణిలో ఫైటింగ్ సీన్లు తీశారు. ఈ హీరో హీరోయిన్లు కన్నడలో పలు చిత్రాల్లో నటించారని, తెలుగులో తొలి పరిచయమని.. తర్వాత మురారి, రామచంద్రపురంలో షూటింగ్ జరుగుతుందని యూనిట్ సభ్యులు పేర్కొన్నారు. షూటింగ్ తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు.

అన్నవరంలో పోలీసులు అప్రమత్తం

ఢిల్లీ ఘటన నేపథ్యంలో తనిఖీలు

అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పేళుళ్ల ఘటన నేపథ్యంలో కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానానికి వేలాదిగా భక్తులు వస్తున్నందను జిల్లా ఎస్పీ ఆదేశాలతో అన్నవరం పోలీసులు అప్రమత్తం అయ్యారు. గ్రామంలో ఉన్న ప్రైయివేట్ లాడ్జిలను తనిఖీ చేయడంతో పాటుగా ఆర్టీసీ కాంప్లెక్స్ పార్శిల్ కార్యాలయాలు, వాహన తనిఖీలు చేపట్టారు. రద్దీ ప్రదేశాల్లో ఎవరైనా బ్యాగ్‌లు మరిచిపోయినా, వదిలిపెట్టి వెళ్లిపోయినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. లాడ్జిల్లో ఎవరు దిగుతున్నారు వంటి పూర్తి వివరాలు తప్పనిసరిగా రికార్డు చేయాలని కోరారు. తనిఖీల్లో అన్నవరం ఎస్ఐ హరిబాబు తదితరులు ఉన్నారు.



అన్నవరం ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

కాకినాడలో ట్రక్ క్యాబిన్ దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రూ. 20 లక్షల ఆస్తినష్టం

కాకినాడ క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి వస్తున్న 40 ఫీట్ ట్రైలర్ ట్రక్ వాహనం క్యాబిన్ షార్ట్ సర్క్యూట్‌కు గురై దగ్ధమైన సంఘటన మంగళవారం రాత్రి కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ నుం చి కాకినాడకు హోర్డింగ్ మెటీరియల్‌తో వస్తున్న ట్రైలర్ ట్రక్ కాకినాడ సమీపంలో ఉన్న ప్రతాప్‌నగర్ వంతెన వద కువచ్చేసరికి వాహనం క్యాబిన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసిపడి వ్యాపించాయి. వెంటనే వాహన డ్రైవర్ అతడి సహాయకుడు బయటకు దూకి ప్రాణాలను కాపాడుకున్నారు. అది గమనించిన స్థానికులు అగ్ని మాపక శాఖకు సమాచారం ఇచ్చారు. సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు సిబ్బంది, ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే క్యాబిన్ ముందు భాగం పూర్తిగా దగ్ధమైంది. ఆస్తినష్టం సుమారు రూ.20 లక్షలు ఉంటుందని ఏడీఎఫ్‌వో తెలిపారు.

హరోంహర..

కత్తిపూడిలో వైభవంగా తీర్థకావిడి ఉత్సవం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష పూజలు, అభిషేకాలు





కత్తిపూడిలో ఊరేగింపు



కలశాలు తీసుకెళుతున్న మహిళలు

శంఖవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తీర్థకావిడి ఉత్సవం వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్యుడి మాలధారులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఈ వేడుక జరిగింది. తెల్లవారుజాము నుంచి స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కలశాలతో తీర్థకావిళ్లను అనుసరించి గ్రామోత్సవం నిర్వహించారు. కలశాలతో తీసుకువచ్చిన జలాలతో మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. హరోంహర నామంతో గ్రామం మార్మోగింది. కోలాటం ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ఛైర్మన్ గాబు గంగ భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రోడ్డు డెవలప్మెంట్ బోర్డు డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు ఉన్నారు.

అపీత కుచాంబకు ధాన్యాలంకరణ

ప్రత్తిపాడు మండలం రాచపల్లి అరుణాచల క్షేత్రంలో పంచామృతాభిషేకాలు

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద గల అరుణాచల క్షేత్రంలో కొలువైన అపీత కుచాంబ అమ్మవారికి మంగళవారం ధాన్యాలంకరణ చేశారు. కార్తీక బహుళ షష్ఠి పురస్కరించుకుని అమ్మవారి ఆలయ గుమ్మానికి వరి కంకులతో కూడిన ధాన్యం గుత్తులు వేలాడ దీసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సుబహ్మణ్యేశ్వర స్వామి, అరుణాచలేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. భార త మాత హోమాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు స్వామి రమానంద ఆధ్వర్యంలో వేద పండితులు పుష్కరిణి వద్ద హారతులు ఇచ్చారు. ధ్వజ స్తంభం వద్ద ఆకాశ పూజలు నిర్వహించారు.





ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో పుష్కరిణి వద్ద హారతులు ఇస్తున్న మహిళలు, అపీత కుచాంబ అమ్మవారికి ధాన్యాలంకరణ

కొత్త వంగడాల సాగుతో అధిక దిగుబడులు


కొంకుదురులో కొత్త వంగడాలు వేసిన పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఏరువాక శాస్త్రవేత్తలు

బిక్కవోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు కొత్త వంగడాలు సాగు ద్వారా ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించుకోవాలని జిల్లా ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్లు చల్లా వెంకటనరసింహరావు, మానుకొండ శ్రీనివాస్ సూచించారు. కొంకుదురులో సార్వా కాలంలో పరిశోధనల నిమిత్తం రైతు కమతాల్లో వేసిన ఎంటీయూ-1443, రాగోలు రకాలైన ఆర్‌జీఎల్-7030, 7034, 7045, 7039, 7038 నూతన రకాలను మంగళవారం పరిశీలించి మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈ రకాలు పంట చేనుపై పడకుండా, సుడిదోమ ఆశించకుండా, కంకి నిండా గింజలతో ఆశాజనక దిగుబడులు ఇస్తున్నాయన్నారు.అలాగే దాళ్వాకు అనుకూలమైన ఎంటీయూ-1121, 1293, ఎన్‌ఎల్ఆర్-344 49 వంటి రకాలు వేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, ఏవో ఎస్.శామ్యూల్‌జాన్, ఏఈవో భాస్కరరెడ్డి, రైతులు కొవ్వూరి రామస్వామిరెడ్డి, కురుపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన మార్నింగ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్‌కళాశాలలో జరుగుతున్న మార్నింగ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో చైత చీతాస్ టీం విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్ ముఖ్య అతిథులుగా విచ్చేసి విన్నర్, రన్నర్ జట్లకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. యువత ధృడంగా ఉంటేనే దేశానికి బలమని వారన్నారు. ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మునిరత్నంకు బ్రౌన్‌స్మారక సాహిత్య పురస్కారం


మునిరత్నంకు పురస్కారం అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ మందిరంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డిమునిరత్నం నాయుడుకు బ్రౌన్ స్మారక సాహిత్య పురస్కారాన్ని సన్నిధానం నరసింహ శర్మ అందజేశారు. ఈ సందర్భంగా మునిరత్నం మాట్లాడుతూ తనకు ప్రదానం చేసిన ఈ పురస్కారాన్ని మృతిచెందిన తెలంగాణ కవి అందెశ్రీకి అంకితం ఇస్తున్నట్టు ప్రకటించారు. తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని సేవలందించడంలో అకుంఠిత దీక్ష కలిగిన బ్రౌన్ జయంతి సందర్భగా తాను పురస్కారాన్ని పొందడం ఆనందంగా ఉందన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం భవిష్యత్ కార్యాచరణకు 120 కోట్లతో ప్రణాళిక ఉందని అన్నారు.తెలంగాణ ఆవిర్భావం తరువాత ఆంధ్రప్రదేశ్‌కి రావాల్సిన ఆస్తులను పొందే విషయంలో కృషి జరుగుతోందన్నారు. కళలు, చరిత్ర, సంస్కృతికి పెద్దపీట వేయడమే తెలుగు విశ్వవిద్యాలయం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మందిరం నిర్వాహకులు సన్నిధానం శాస్త్రి, డాక్టర్ కర్రిరామారెడ్డి, యార్లగడ్డ చిట్టిబాబు, మల్లాది శ్రీరామ్, కోసూరి చండీప్రియ, గరికిపాటి భవాని పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీలో థీసిస్ రైటింగ్ వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఇంటర్నేషనల్ ఇంటెన్సివ్ థీసిస్ రైటింగ్ వర్క్‌షాప్ (ఐఐటీడబ్ల్యుడబ్ల్యు) పోస్టర్ ఆవిష్కరించారు. కళాశాలలోని ఇంగ్లీష్ విభాగం, ఐక్యూఏసీ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకుల్లో పరిశోధన సామర్థ్యాన్ని పెంచడానికి, థీసిస్ రైటింగ్ నాణ్యత ప్రమాణాలను అభివృద్ధి చేయడానికి ఈ వర్క్‌షాప్ మంచి వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.స్వర్ణశ్రీ, అకడమిక్ కో ఆర్డినేటర్ శరత్‌బాబు, ప్లేస్‌మెంట్ సెంటర్ కన్వీనర్ వీవీబీ సంజీవరావు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించాలి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ఉగ్రవాద భూతాన్ని కూకటివేళ్లతో పెకలించాలని రాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక ఫ్రంట్ గౌరవాధ్యక్షుడు రాజేశ్వరరావు, రాష్ట్రాధ్యక్షుడు కాండ్రేగుల శంకర్, ప్రధాన కార్యదర్శి దర్నాలకోట వెంకటేశ్వరావు పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల ఘటనపై రాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక ఫ్రంట్ రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశం మంగళవారం స్థానిక రాజేంద్రనగర్‌లో జరిగింది. తొలుత ఢిల్లీ బాంబు పేలుడులో మృతి చెందిన పౌరుల ఆత్మశాంతికి మౌనం పాటించారు.అనంతరం జరిగిన సమావేశంలో శంకర్ మాట్లాడుతూ ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటన అత్యంత హేయమని, దేశంలో రాజకీయాలకతీతంగా అందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఉగ్రవాద కార్యకలాపాలపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలన్నారు.సమావేశంలో షేక్ అహ్మద్, ఆలీపాము శ్రీను,నామాల అశోక్‌కుమార్, నక్కిన జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మారుపేరుగా రాజమహేంద్రవరం!


రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వాసు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరాన్ని అభివృద్ధికి మారుపేరుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక ప్రియాంక గార్డెన్స్ నుంచి జాగృతి బ్లడ్ బ్యాంక్ వరకు రూ.32 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు పనులకు మంగళవారం ఆయన ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక నగరంలోని ఏదొక ప్రాంతంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు జరుగుతూనే ఉన్నాయని చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో డివైడర్లకు రాళ్లు అంటించారని, డివైడర్లు మూసి వర్షపునీరు రోడ్డుపై పారేలా నిర్మాణాలు చేసి ముంపు సమస్యను పెంచారని, జంక్షన్లు ఇరుకుగా మార్చేసారని అనాలోచిత నిర్ణయాలతో ప్రజాధనం దుర్వినియోగం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి దరఖాస్తులు చేసుకోండి

కోరుకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి నిధుల కోసం శ్రీవాణి ట్రస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు కోరుకొండలో మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలో 5 వేల ఆలయాలను నిర్మించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు రూ.750 కోట్లు కేటాయిస్తూ టీటీడీ బోర్డు సమావేశంలో తీర్మానం చేశారన్నారు. ఈ మేరకు తొలి విడతగా రూ.187 కోట్లు విడుదల చేశారన్నారు. కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లోని గ్రామాల్లో నిర్మించే ఆలయాలను 3 కేటగిరీలుగా విభజించి శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు కేటాయించనున్నట్టు చెప్పారు. మొదటి కేటగిరి దేవాలయాలకు రూ.10 లక్షలు చొప్పున, రెండో కేటగిరిలో రూ.15 లక్షలు చొప్పున, మూడో కేటగిరిలో రూ.20 లక్షలు చొప్పున కేటాయింపులు జరుగుతాయన్నారు. ఇందు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు దేవాలయం నిర్మించదలచిన భూమి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పంచాయతీ కార్యదర్శి నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్, దేవాలయం కమిటీ తీర్మానం, దేవాలయం పేరుతో ప్రారంభించిన బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలు, శ్రీవాణి ట్రస్టుకు అందజేసే దరఖాస్తులకు జత చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

సమగ్రత, దేశభక్తి భావాలను మరింత బలపరచాలి

రాజమహేంద్రవరంలో యూనిటీ మార్చ్ నిర్వహించిన బీజేపీ శ్రేణులు, విద్యార్థులు



యూనిటీ మార్చ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సోము

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయి పటేల్ సేవలను స్మరించుకుంటూ దేశంలో ఐక్యత, సమగ్రత, దేశభక్తి భావాలను మరింత బలపరచాలనే ఉద్దేశ్యంతో యూనిటీ మార్చ్ నిర్వహించినట్టు బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలో బీజేపీ ఆధ్వర్యంలో వివిధ కళాశాలల విద్యార్థులతో యూనిటీ మార్చ్ నిర్వహించారు. ఎమ్మెల్సీ వీర్రాజు జెండా ఊపి మార్చ్ ప్రారంభించి మాట్లాడారు. ఆనం కళాకేంద్రం నుంచి వై.జంక్షన్ వరకూ ఈ మార్చ్ సాగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, నాయకులు కురగంటి సతీష్, రవిశంకర్, పైబోయిన సురేంద్ర, కాలెపు సాయిరాం, వరప్రసాద్, మై భారత్ బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు దివాన్‌చెరువులో జనవాణి

దివాన్‌చెరువు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక జనవాణి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బుధవారం దివాన్‌చెరువులో నిర్వహించనున్నారు. గ్రామసచివాలయం-1 వద్ద ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలకు సంబంధించి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారు.

జీవీపీని వంద శాతం తొలగించాలి

పబ్లిక్ హెల్త్ అధికారులతో సమీక్షలో కమిషనర్ రాహుల్‌మీనా


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు11(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రస్తుతం ఉన్న గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను(జీవీపీ) వందశాతం తొలగించాలని మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్ల వెంట వ్యర్థ పదార్థాలను వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని చెప్పారు. రోడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, ఊడ్చిన చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తివేయాలని,ప్రతిరోజు పారిశుధ్య కార్మికులు ఎంత మంది విధులకు వస్తున్నదీ రికార్డులు ఉండాలన్నారు. ఉదయం 6:30 గంటలకు ఎట్టి పరిస్థితుల్లో డోర్ టూ డోర్ చెత్తసేకరణ మొదలు కావాలని ఆదేశించారు. వీధి వ్యాపారులు,హోటళ్లు, టీపాయింట్లు, జ్యూస్ స్టాల్స్ యజమానులు తప్పనిసరిగా చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. హస్టళ్ల పరిసరాల్లో మెరుగైన పారిశుధ్యాన్ని నిర్వహించాలన్నారు. అనంతరం చెత్త సేకరణ వాహనాల కండిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. మరమ్మత్తులుంటే తక్షణమే చేయించాలని ఆదేశించారు. వీధి కుక్కల విషయంలో సుప్రీంకోర్టు గైడ్‌లైన్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు. రిపబ్లిక్ గ్రీవెన్స్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేయడంతో పాటు రీఓపెన్ కాకుండా చూడాలన్నారు.సమావేశంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్‌లు, ఇన్‌స్పెక్టర్లు, బయాలజిస్టులు, సచివాయల శానిటరీ సెక్రటరీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

రాజమహేంద్రవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వచ్చేసిన 15ఏళ్ల బాలుడిని తల్లిదండ్రుల చెంతకు శక్తి టీం చేర్చింది. మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ మంగాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లాకు చెందిన టి.ప్రభుదేవా కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేశాడు. రాజమండ్రిలో తాపీపనిలోకి వెళ్తూ జీవిస్తున్నాడు.అయితే బాపట్లలో బాలుడి అదృశ్యం కేసు నమోదు కావడం తమ దృష్టికి రాగా ఎస్ఐ అమీనాబేగం తన శక్తిటీంతో గాలింపు చేపట్టారని సీఐ చెప్పారు. మంగళవారం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై ఆ బాలుడిని గుర్తుపట్టి ప్రశ్నించారన్నారు.ప్రభుదేవాగా నిర్ధారించుకొని తండ్రికి సమాచారం ఇచ్చామన్నారు. ఆయన రావడంతో ఇద్దరికీ కౌన్సెలింగ్ చేసి ప్రభుదేవాను అప్పగించామని చెప్పారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి


రామవరంలో ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు.రాజమహేంద్రవరం అజాద్‌చౌక్‌లో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ఆజాద్ ఫ్లెక్సీకి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాద్ విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకొచ్చారని దేశంలో ఐఐటీలు స్థాపించి ఈనాటి దేశాభివృద్ధికి బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో కొవ్వూరి శ్రీనివాస్,మ హ్మద్ అలీ, లాలఖాన్, మజీద్ అధ్యక్షుడు ఆరీఫ్, నాయీముద్దీన్, సల్మాన్, బాష, ఖాన్‌బాబు మొయిన్ , రబ్బానీ, షబ్బీర్ పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని రామవరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచ్చేసి ఆజాద్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా పోరాటం చేసి దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యాభివృద్ధికి తొలి ప్రణాళికను రూపొందించిన ఆ జాద్ చిరస్మరణీయుడన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక ప్రభుత్వ బీఈడీ కళాశాలలో మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించా రు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ ఆజాద్ భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా అనేక విద్యా సంస్కరణలు చేశారని,విద్యాసంస్థలను నెలకొల్పారన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అంద జేశారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి.సత్యా జీ, అధ్యాపకులు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.


రాజమండ్రి ప్రభుత్వ బీఈడీ కళాశాలలో జాతీయ విద్యాదినోత్సవం

రాజానగరం: గైట్ పాలిటెక్నిక్ కళాశాలలోనూ, గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో ఎన్‌ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలోనూ జాతీయ విద్యాదినోత్సవాన్ని వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో జీజీయూ డీన్ బి.శ్రీనివాసరాజా, గైట్ ప్రిన్సిపాల్ పీజీ రామానుజం, వైస్ ప్రిన్సిపాల్ బి.కిరణ్, ఎన్‌ఎస్ఎస్ పీవో బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కణుపూరులో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

కోరుకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలం కణుపూరు గ్రామానికి చెందిన పలువురికి వైద్యం అనంతరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సిఫార్సుతో మంజూరయిన ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే సతీమణి, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి లబ్ధిదారుల మంగళవారం వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. గ్రామానికి చెందిన బొల్లింపల్లి వెంకట రామారావుకి మంజూరయిన రూ.1,16,361, యార్లగడ్డ సోమయ్యకు రూ.30,451, మర్ల ముందురు నరసింహరావుకు రూ.30 వేలు విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వెంటకలక్ష్మి వెంట జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు

బిక్కవోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి జన్మ నక్షత్రమైన బహుళ షష్ఠి, ప్రీతికరమైన మంగళవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి వచ్చారు. రాహు, కేతు, కుజ, సర్ప దోష నివారణార్థం 382 మంది దంపతులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాలతో అభిషేకాలు జరిపి స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రంగంపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిశలేరు గ్రామంలో రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు 48 గంటల్లో వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమచేయాలన్నారు. అనంతరం రాయితీపై రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేశారు. 20 కిలోల శనగవిత్తనాలు రూ.1170కు అందిస్తున్నామని వ్యవసాయశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు.కార్యక్రమంలో రంగంపేట సొసైటీ ప్రెసిడెంట్ గారపాటి రాంబాబు, ఆత్మకమిటీ డైరెక్టర్ ఉప్పలపాటి బుల్లిదొర, కూటమి నాయకులు పోతుల వెంకటరావు, మాచిన వెంకన్నదొర, మద్దిపూడి సత్తిబాబు, అడబాల వెంకటరావు, పోతుల చిన్నికాపు, ఎంపీడీవో వీవీ సాయిబాబు, ఏవో కె.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని దుప్పలపూడిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అనపర్తి సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు.ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా 24 గంటల్లో సొమ్ములు చెల్లిస్తుందన్నారు.జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కోటక్ బ్యాంకు ఎదుట బ్యాంకు ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని కొటక్ మహీంద్రా బ్యాంకు ఎదుట ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్ లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ఏఐబీఈఏ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలనే ఆందోళనకు మద్దతుగా ఈ ధర్నా నిర్వహించామన్నారు. ప్రైవేట్ బ్యాంకులను జాతీయకరణం చేయాలని, క్లరికల్ సబ్ స్టాఫ్ నియామకాలు చేపట్టాలని, కాస్ట్ టు కంపెనీ ఉద్యోగులు అందరినీ క్రమబద్ధీకరించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో సోమరాజు, మురళీధర్, స్వాతి, రమేష్, అప్పారావు, కిషోర్, రాంబాబు, కామేష్ పాల్గొన్నారు.

ముగిసిన సైబర్ దినోత్సవం

రాజానగరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో రెండురోజులపాటు జరిగిన గ్లోబల్ సైబర్ దినోత్సవం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సైబర్ భద్రత విశ్వసనీయ డిజిటల్ ప్రపంచం అనే అంశంపై వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేపీఎంజీ అస్యూరెన్స్, కన్సల్టింగ్ సర్వీసెస్ డిజిటల్ ట్రస్ట్ డైరెక్టర్ అస్మితా కుమార్ మాట్లాడుతూ ఆన్లైన్ భద్రత సంస్కృతి, మొబైల్ ఫోన్ల సురక్షిత వినియోగం వంటి పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో కేపీఎంజీ అనలిస్ట్‌లు సిరికా రోహిత, అరుంధతి పాతూరి పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో జీజీయూ ఉపకులపతి యు.చంద్రశేఖర్, అడ్మిషన్‌ల డైరెక్టర్ వి.సతీష్‌కుమార్, డీన్స్ బి.సుజాత, బి.శ్రీనివాసరాజా, ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్, హెచ్‌వోడీలు వి.సుబ్రహ్మణ్యం, ఆర్.తమిళ్‌కోడి పాల్గొన్నారు.

జిల్లా రవాణా కార్యాలయంలో ప్రత్యేక పౌరసేవా కౌంటర్

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం నమ్మొద్దు

జిల్లా రవాణా అధికారి సురేష్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణా కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం కొన్నాళ్లుగా ప్రత్యేక పౌరసేవా కౌంటర్, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఏర్పాటు చేసినట్టు జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ మంగళవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. రవాణా కార్యాలయంలో సేవలు నిలిచిపోయాయని సోషల్ మీడియా, స్థానిక వర్గాల్లో కొంతమంది వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఈ రకమైన వదంతులను ప్రజలు నమ్మొద్దని సూచించారు. జిల్లా రవాణా కార్యాలయంలో అన్ని పౌర సేవలు చట్టబద్ధమైన విధానంలో అందుబాటులో ఉన్నాయని, వాహనాలకు సంబంధించి అన్ని సేవలు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లలో నేరుగా పొందవచ్చని, సేవలు పూర్తి పారదర్శకంగా ఫీజుల వివరాలతో ఆన్‌లైన్‌లో స్పష్టంగా ఇచ్చామన్నారు. టెక్నాలజీ వినియోగంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలందించడమే తమ లక్ష్యమని, కార్యాలయ పని సమయంలో తనతో పాటు పరిపాలనాధికారి సత్తిబాబు,ఇతర అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏదైనా సేవాపరమైన ఇబ్బంది, ఆలస్యం, ఫిర్యాదు ఉంటే నేరుగా తమ కార్యాలయ అధికారులను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

మాదకద్రవ్య రహితంగా జీవించాలి

దివాన్‌చెరువు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన క్రమశిక్షణతో కూడిన, మాదకద్రవ్య రహిత జీవన విధానాన్ని అవలంబించాలని ఈగల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పీవీ సూర్యమోహనరావు కోరారు. భూపాలపట్నంలోని రైట్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మోహనరావు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే సమాజంలో మహిళల ప్రాముఖ్యతను తెలిపారు. ఎస్ఐ బి.నరేష్ కుమార్ ఆపరేషన్ గరుడ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని వివరించారు. మాదకద్రవాల్యలను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్‌లను ప్రదర్శించడంతో బాటు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.భాస్కర్‌ముత్యాలు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.

స్వదేశీ ముద్దు..విదేశీ వద్దు..

బిక్కవోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వ దేశీ వస్తువులే ముద్దు అని, విదేశీ వస్తువులు వాడొద్దని బీజేపీ మండలాధ్యక్షుడు గుడిమెట్ల దుర్గారెడ్డి పిలుపునిచ్చారు. బిక్కవోలులో మంగళవారం ఆత్మ నిర్భర్-భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. భారత్‌ను స్వావలంబన దేశంగా మార్చేందుకు ప్రతి ఒక్క రూ స్వదేశీ వస్తువులు వినియోగించాలన్నారు. అనంతరం గ్రామంలో వివిధ షాపులు తిరిగి స్వదేశీ వస్తువులనే విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి, హే మతులసి, ఓవీ కృష్ణ, బోగాది వెంకటరమణ, వడ్లమూరి లక్ష్మి పాల్గొన్నారు.

మార్గానికి బెస్ట్ కస్టమర్ పురస్కారం

కడియం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బెస్ట్ కస్టమర్ పురస్కారం కడియపులంక వీర హనుమాన్ నర్సరీ అధినేత మార్గాని సత్యనారాయణకు దక్కింది. యూనియన్ బ్యాంక్ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రాజమహేంద్రవరంలో బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎం విశ్వేశ్వరరావు, డీఆర్ఎం మనోజ్‌ల కడియం బ్రాంచ్ మేనేజర్ సుభాష్ పాల్గొన్నారు.

కార్తీక వన సమారాధన

సీతానగరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగలపూడి-రామచంద్రపురం రోడ్డులో ఉన్న బ్రాహ్మణ బుల్లమ్మ మామిడి తోటలో మంగళవారం శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పజ్జూరి నాగేశ్వరరావు, కుంచెర్ల గోవిందరావు, గమిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సత్యనారాయణ స్వామి వ్రతం, వాసవీమాతకు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా అందరూ ఆటపాటలతో కాలక్షేపం చేశారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

రంగంపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సుభద్రంపేటలో కమ్యూనిటీహాలు వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాన్ని రాజకీయ విశ్లేషకుడు అడబాల మరిడియ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, పూసల దేవరత్నం, ఎరుబండి సత్యనారాయణ, ప్రగడ తాతారావు, సాధనాల ధర్మరాజు, లక్ష్మీరెడ్డి సత్యనారాయణ, ప్రగడ సూర్యానందం,పేపకాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ - రాజమహేంద్రవరం

ఆర్.ఒ.సి.నెం.12285/2002-216 తేది:8-11-2025

వేలము నోటీసు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు సంబంధించిన తుమ్మలావ ప్రాంతములో గల డా.బి.ఆర్.అంబేద్కర్ కమ్యూనిటీ హాలుకు స్వాధీనం చేయబడిన తేదీ నుండి లేదా నగరపాలక సంస్థ నిర్ణయించిన తేదీ లగాయితు 3సంవత్సరములు కాలపరిమితికి నెలసరి అద్దె చెల్లించు ప్రాతిపదికపై అనుభవించు గుత్త హక్కును నెలవారీ అద్దె ప్రాతిపదికపై వేలమును నగరపాలక సంస్థ కార్యాలయము నందు ది.20-11-2025 తేదీన నిర్వహించబడును. వేలములో పాల్గొనుటకు ఆసక్తి గలవారు యిందుతో జతపర్చబడిన పట్టికలో చూపిన ప్రకారము ధరావత్తు సొమ్ము కమీషనరు, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం వారి పేరున డిమాండు డ్రాఫ్టు మరియు మూడు సంవత్సరముల కాలమునకు బ్యాంకు గ్యారంటీ తీసుకొని నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగములో ది.19-11-2025వ తేది సాయంత్రం గం.4:00 లోపు దరఖాస్తు దాఖలు చేయవలెను. చెక్కులు స్వీకరించబడవు. ధరావత్తు (డిమాండ్ డ్రాఫ్ట్), బ్యాంకు గ్యారంటీ, ఆధార్ జిరాక్సులతో దరఖాస్తు దాఖలు చేయవలెను. దరఖాస్తు దాఖలు పరిచినవారిని మాత్రమే వేలమునకు అనుమతించబడును. వేలం కమిషనరు గారిచే గాని, లేదా వారి అధీకృత అధికారి వారిచే గాని నిర్వహించబడును. వేలములో పాల్గొనువారు నగరపాలక సంస్థకు ఏ విధమైన బకాయిలు వుండరాదు మరియు నగరపాలక సంస్థకు సంబంధించి ఏ విధమైన కోర్టు కేసులు కలిగియుండరాదు.

వేలములో ఖాయపరచిన నెలవారీ అద్దెతో పాటు 3నెలల అద్దె (జి.ఎస్.టి. అదనము) అడ్వాన్సుగా 7దినములలోగా చెల్లించిన తదుపరి కమ్యూనిటీ హాలును అప్పగించబడును. నగరపాలక సంస్థ నిర్ణయించు అద్దెపై జి.ఎస్.టి.తో కలిపి చెల్లించవలెను. మొదటిసారి లీజు కాలము3 సంవత్సరములు, తదుపరి 3 సంవత్సరములకు లీజుదారు రెన్యూవల్ కొరకు దరఖాస్తు చేసిన యెడల స్థాయీ సంఘము వారి ఆమోదమునకు లోబడి 33 1/3 శాతం పెంపుదల (లేదా) మార్కెట్ విలువపై 10% సంవత్సరము అద్దెగా లేదా పరిసర ప్రాంతాలలోని వేడుకలకు అద్దెకు ఇచ్చే హాల్సు అద్దెతో సరిపోల్చి ఏది అధికమైన దానిపై అద్దె హెచ్చింపు నిబంధనపై లీజు పొడిగించబడును. తదుపరి కమ్యూనిటీ హాలును నగరపాలక సంస్థకు విధిగా అప్పగించవలెను.వేలమును ఖాయపరచుటకు లేదా తిరస్కరించుటకు కమీషనరు గారికి పూర్తి అధికారం కలదు. మరియు నగరపాలక సంస్థ విధించు అన్ని ఇతర షరతులకు లోబడి వేలము నందు పాల్గొనవలెను. ఇతర వివరములు తెలుసుకొనదలచినచో ఆఫీసు పనిచేయు వేళలలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగము నందు రెవెన్యూ అధికారి-1 వారిని సంప్రదించవచ్చు.

కమిషనర్
నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

నేడు పేదింట.. పెద్ద పండుగ

8773 ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు

రాజమహేంద్రవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటికల నెరవేరుతోంది.జిల్లాలో బుధవారం 8773 ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహిస్తారని మంగళవారం జిల్లా హౌసింగ్ పీడీ నాతి బుజ్జి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తయిన ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయిస్తుండడం గమనార్హం.జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బుధవారం గృహ ప్రవేశాలు జరగనున్నాయి. అనపర్తి నియోజకవర్గంలో 776, రాజమండ్రి రూరల్‌లో 375, రాజానగరంలో 631, రాజమండ్రి అర్బన్‌లో 3097, కొవ్వూరులో 847, గోపాలపురంలో 1760 ఇళ్లలో గృహప్రవేశాలు జరగనున్నాయి.నిడదవోలులో మంత్రి కందుల దుర్గేష్,బిక్కవోలులో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, శ్రీకృష్ణపట్నంలో ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, కడియంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజమండ్రి 46వ వార్డులో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కొవ్వూరు శ్రీరామకాలనీలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నల్లజర్ల మండలం పోతవరంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో గృహ ప్రవేశాలు జరుగుతాయి.గోకవరం కామరాజుపేటలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో గృహ ప్రవేశాలు జరుగుతాయి.

విజన్ చంద్రుడు!

- పల్లెల్లో పారిశ్రామిక పార్కులు
- మూడు నియోజకవర్గాల్లో ఏర్పాటు
- వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం

రాజమహేంద్రవరం, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి) : ఎన్నికల్లో ఏం చేస్తారో చెప్పారు.. అధికా రంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు చేసి చూపి స్తున్నారు.. తన విజనేంటో ప్రజలకు తెలియజేస్తు న్నారు. ప్రతి ఒక్కరినీ అభివృద్ధి చేసే దిశగా అడు గులు వేస్తున్నారు సీఎం చంద్రబాబు. ఇంటికో పారిశ్రామికవేత్త తయారవ్వాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం నియోజకవర్గానికో పారిశ్రామిక వాడను నిర్మించడానికి సన్నాహాలు చేస్తోంది. 2030నాటికి ఒక వ్యవస్థాప కుడు- ఒక కుటుం బం పేరుతో ప్రయత్నాలు ఆరంభించారు. అందులో భాగంగా మంగళవారం జిల్లాలో రాజమండ్రి రూరల్ ధవళేశ్వరం, గోపాలపురం నియోజకవర్గం చెరుకుమిల్లి, నిడదవోలు బసివి రెడ్డిపేటలో మూడు ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ లను సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రా మికవేత్త తయారుకావాలన్నదే తన లక్ష్యమ న్నారు. దానిలో భాగంగానే ఈ కాంప్లెక్స్‌లు నిర్మి స్తున్నామని తెలిపారు. ధవళేశ్వరంలో 2 ఎకరాల్లో రూ.15 కోట్లతో 26 యూనిట్లను నెలకొల్పే విధం గా ఎఫ్ఎఫ్‌సి నిర్మించనున్నారు.చెరుకు మిల్లిలో 13 ఎకరాల ప్రభుత్వ భూమిలో 2.5 ఎకరాల్లో ఎఫ్ఎఫ్‌సీ నిర్మించను న్నారు. నిడదవోలు బసివి రెడ్డిపేటలో 2 ఎకరాల్లో రూ.13.12 కోట్లతో 26 యూనిట్లుగా సరిపడ భవనం నిర్మిస్తారు. సుమారు 6 నెలలో ఎఫ్ఎఫ్‌సి కాంప్లెక్స్‌ను పూర్తి చేయనున్నట్టు ఏపీఐఐసీ అధికారులు తెలిపారు.



రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరంలో పారిశ్రామిక పార్కును వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు చిత్రంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘా స్వరూప్, కూటమి నాయకులు

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణిగా శ్రీదేవి



రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణిగా డాక్టర్ బి.శ్రీదేవి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా నుంచి పదోన్నతిపై వచ్చారు. ముందుగా డాక్టర్ శ్రీదేవి డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డిప్యూటీ డెమోగా పి.సత్యవతి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణిగా పనిచేసిన కోమలి పదోన్నతిపై కాకినాడ జీజీహెచ్‌కు సీఎస్ ఆర్ఎంవోగా బదిలీ అయినట్టు సమాచారం.



అధికారులకు సూచనలు చేస్తున్న అమలకుమారి

పది పరీక్షల ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదల

రాజమహేంద్రవరం/గోకవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మార్చి-2026లో నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదలైందని డీఎస్ఈవో వాసుదేవరావు తెలిపారు. అన్ని సబ్జెక్టులకు రూ.125, 3 కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, 3 సబ్జెక్టుల వరకూ రూ.110, వొకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60, వయసు నిర్ధారణకు రూ.300 ఫీజును ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ఈ నెల 13 నుంచి డిసెంబరు 25 వరకూ చెల్లించవచ్చన్నారు.ఈ నెల 26 నుంచి డిసెంబరు 3 వరకూ రూ.50, డిసెంబరు 4 నుంచి 10 వరకూ రూ.200, డిసెంబరు 11 నుంచి 15 వరకూ రూ.500 ఆలస్య రుసుంతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫీజులు https://bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న స్కూల్ లాగిన్ ద్వారా చెల్లించాలన్నారు. పదవ తరగతి ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.అమలకుమారి మంగళవారం గోకవరం మండలంలో పది పరీక్షలు నిర్వహించే కేంద్రాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

హోమ్ స్టేకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగాభివృద్ధి, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించడమే లక్ష్యంగా 'హోమ్ స్టే, బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పాలసీ 2024-2029'ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. హోమ్ స్టే యజమానులకు ఏడేళ్లపాటు నూరు శాతం ఎస్‌జీఎస్‌టీ తిరిగి చెల్లింపు, మొదటి మూడేళ్లు ఉచిత రిజిస్ట్రేషన్, విద్యుత్, నీరు, చెత్త, ఆస్తి పన్ను ధరల్లో గృహ వినియోగ రేట్లు వర్తిస్తాయన్నారు. పీఎం సూర్యఘర్ యోజన, ముద్ర పథకం ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ పథకంలో శిక్షణ, నైపుణ్యాభివృద్ధి ఉంటుందన్నారు. నమోదు, పర్యవేక్షణ బాధ్యతలు ఏపీ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో ఉంటుందన్నారు.వివరాలకు https://home-stays.staging.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని..అదే వెబ్‌సైటులో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం సూచించారు.



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

గూఢసార్‌లెక్కడ!

ఉమ్మడి జిల్లాలో నిద్దరోతున్న నిఘా

మనలో ఒకడు.. మనతో పాటే ఉంటాడు.. మనలాగే ఉంటాడు..ఆనుపానులు చూసుకుంటాడు.. ప్రమాదాన్ని పసిగడతాడు.. ఉన్నతాధికారులకు చేరవేస్తాడు.. ప్రమాదం జరగకుండా కాపాడతాడు.. ఇదీ గూఢచారి వ్యవస్థ.. ఉమ్మడి జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ గూఢచారి వ్యవస్థ ఉంటుంది.. గతంలో అయితే వీళ్లు ఎవరనేది ఎవరికీ తెలిసేది కాదు.. ప్రస్తుతం గూఢసార్‌లెవరనేది అందరికీ తెలిసిపోతోంది.. నిఘా లేదు.. ఏం లేదు.. ప్రమాదాన్ని పసిగట్టే పనిలేదు.. బాస్‌లకు సేవ చేసుకుంటూ కొసరు పనులతో దర్జాగా గడిపేస్తున్నారు. ఢిల్లీలో బాంబ్ పేలుడు ఘటనతో దేశమంతా ఉలిక్కిపడింది..ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నిఘా వ్యవస్థపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సాంకేతికత వినియోగం.. నిఘా.. ఈ రెండు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో అత్యంత కీలకమైన భూమిక పోషిస్తాయి. యూనిఫాం వేసుకొని ఎన్నిసార్లు చక్కర్లు కొట్టినా చిక్కని వాటిని నిఘాతో పసిపగట్టి పనిపట్టవచ్చు. ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటన చూస్తే హృదయం కలచివేస్తోంది. పోలీసులు ముందుగా పసిగట్టకుండా ఏం చేస్తున్నారనే ప్రశ్న సర్వత్రా వినవస్తోంది. అయితే యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్, నిఘా వర్గాల సమన్వయంతో పెద్ద ఉపద్రవాన్ని తప్పించాయి. మారణహోమాన్ని మట్టుబెట్టాయి.మరి ఉమ్మడి జిల్లాల్లో నిఘా పటిష్టంగా ఉందా? అనే ప్రశ్నకు మేల్కోవాలనే సమాధానం వినబడుతుండడంపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

- ఢిల్లీ బాంబ్ పేలుడుతో ఉలిక్కిపడిన జిల్లా
- పోలీసుల తనిఖీలతో భయం..భయం
- కొసరు పనుల్లో ఉమ్మడి జిల్లా నిఘా విభాగం
- ప్రమాదాలను పసిగట్టలేని వైనం

నిఘా విభాగం.. ఏం చేస్తుందంటే..

ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో నిఘా విభాగాల పాత్ర కీలకం. పూర్వం వీళ్లను వేగులు,గూఢచారులు అని పిలిచేవారు. పోలీసుల్లో విజిబుల్ పోలీస్..యూనిఫాం వేసుకొని తనిఖీలు చేస్తుంటారు.యూనిఫాం లేకుండా ప్రజల్లో కలిసిపోయి తీగ లాగడం, కీలక సమాచారాన్ని ఒడిసిపట్టుకోవడం నిఘా విభాగాల (ఇన్‌విజిబుల్ పోలీసింగ్) ప్రధాన విధి. దీని ద్వారా ముందస్తు చర్యలకు మార్గం దొరుకుతుంది. చిన్న నేరాలను నుంచీ భారీ కుట్రలను భగ్నం చేయడం వరకూ వీళ్ల చేతల్లోనే ఉంటుంది. ఢిల్లీ బాంబు పేలుళ్లకు రెండు రోజుల ముందు కీలకమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. గుజరాత్ ఏటీఎస్ పోలీసుల నిఘా విభాగం ఇచ్చిన సమాచారం ఆధారంగా జమ్ముకశ్మీర్, ఉత్తరప్రదేశ్ పోలీసులు, కేంద్ర ఏజెన్సీలు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి ఉగ్రవాదులను అరెస్టు చేశారు. భారీ కుట్రను భగ్నం చేశారు.ఇది కేవలం నిఘా విభాగాల వల్లనే సాధ్యపడింది.

నిఘా పెరగాలి..

ఉమ్మడి జిల్లాలో ఎన్నో కీలకంగా ఉన్నాయి.. పోలవరం ప్రాజెక్టు, గోదావరిపై వంతెనలు, పలు ఫ్యాక్టరీలు, ప్రధాన నగరాల్లో సాయంత్రం వేళ జనసమ్మర్థత ఎక్కువే. మెయిన్‌రోడ్లు కిటకిటలాడుతూనే ఉంటాయి. రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌ల వద్ద ఈనాటికి మెటల్ డిటెక్టర్ వ్యవస్థ అనేది లేదు. రోజూ సుమారు 40 వేల మంది ప్రయాణించే రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు అయితే చాలా దారులున్నాయి. అయినా నిఘా లేదు. కార్తీక మాసం కావడంతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. అక్కడా ఇంతే.

కొసరు పనులతో సరి

పోలీసు శాఖలో ఉండే నిఘా విభాగం కీలకంగా వ్యవహరించాల్సి ఉన్నా అందుకు భిన్నం గా కొసరు పనులు వారికి ఎక్కువైపోయాయనే విమర్శలు ఉన్నాయి. ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ నిఘా(స్పెషల్ బ్రాంచ్-ఎస్‌బీ) పోలీస్ ఒకరు ఉంటారు. జిల్లా స్థాయిలో నిఘా సీఐ, డీఎస్పీకి నేరుగా వీరు సమాచారాన్ని చేరవేస్తూ ఉంటారు. వాళ్ల ద్వారా జిల్లా పోలీస్ బాస్ అయిన ఎస్పీకి.. అవసరమైతే అక్కడి నుంచి పైఅధికారులకు సమాచారం వెళుతుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో దాదాపు 75 పోలీస్ స్టేషన్లలోనూ నిఘా పోలీసులు ఉన్నారు. అయితే అధికశాతం వీళ్లందరూ జేబులు నింపు కోవడానికి పాస్‌పోర్టుల తనిఖీలు, ఇతర వ్యవహారాల్లో తల మునకలైపోయారు. ఎస్పీలకు భజన చేయడం, ఉన్నతాధికారుల సమావేశాలకు ఏర్పాట్లు చేయడం, ఆహార మర్యాదల్లో కొరత రాకుండా చూసుకోవడంలో నిమగ్నమవుతున్నారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం, చివరికి ఉన్నతాధికారి సమావేశంలో కుర్చీ తక్కువైతే వెంటనే రప్పించడం కూడా నిఘా అధికారుల పనిగానే మారిపోయింది.దీంతో అసలు విధులకు సమయం చిక్కడం లేదు. జిల్లాలోని ఎస్పీకి నేరుగా అనుసంధానమై ఉండే ఎస్‌బీ పోలీసులంటే ఆయా పోలీస్ స్టేషన్లలోని సీఐ, డీఎస్పీ స్థాయి అధికారులు భయ పడుతూ ఉండే పరిస్థితి ఉంది. మూడు జిల్లాల్లోని ఒక జిల్లాలో పరిస్థితి మరీ అధ్వానంగా తయారైందనే ఆరోపణలు ఉన్నాయి. ఎస్పీకి దగ్గరగా ఉండే ఎస్‌బీ అధికారులు సీఐలు, ఎస్ఐలను బెదిరిస్తూ తమ 'కార్యకలాపాలు' చక్క బెట్టుకుంటున్నారు.



ఇప్పటికైనా ఓ కన్నేసి..

ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యమే కాకుండా ఇప్పటికైనా నిఘా విభాగాలను ఉన్నతాధికారులు పూర్తిగా పరిశీలించి ప్రక్షాళన చేయాల్సిన అవసరత కనిపిస్తోంది. పోలీస్ స్టేషన్లు, ఎస్పీల వద్ద భజన యూనిఫాంలకు స్వస్తి చెప్పి అనుభవం,నిబద్ధత ఉన్న వారిని నియమించాల్సిన అవసరత కనిపిస్తోంది. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, రద్దీ ప్రదేశాల్లోని పార్కింగ్ ప్రాంతాల్లో నిఘా పోలీసులను నిరంతరాయంగా వినియోగించాలి. నిఘా (ఎస్‌బీ) విభాగం పోలీసుల పనితీరును బేరీజు వేస్తూ కనీసం నెలకో సారి అయినా సమీక్షిస్తూ ఉండాలి.కీలక సమాచార సేకరణ, వాటిని ఉన్నతాధికా రులకు నివేదించడం, ప్రజల్లో మమేకమై సమాచారాన్ని సేకరించడం, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వంటి వాటిపై శిక్షణ ఇప్పించాలి. కొసరు పనులను పక్కన పెట్టించాల్సిన అవసరత కనిపిస్తోంది.

టీడీపీలో పదవుల సంబరం

నాయకుల ప్రమాణ స్వీకారోత్సవాలు ఆరంభం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అధికార తెలుగుదేశం పార్టీలో సంస్థాగత సందడి మొదలైంది. మే నెలలో మహానాడు నుంచి కమిటీల నియామకం జరిగిన సంగతి తెలిసింది. కేవలం జిల్లా కమిటీ మినహా ఏడు నియెజకవర్గాల్లోనూ పట్టణ, మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీలు, వాటి అనుబంధ సంఘాల ప్రమాణ స్వీకారాలు మంగళవారం నుంచి గురువారం లోపు పూర్తి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ పిలుపు ఇచ్చారు. ఎమ్మెల్యేలు,నియోజకవర్గ ఇన్‌చార్జీలతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాలను పండుగలా జరపాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. త్వరలో జిల్లా కమిటీని ప్రకటించనున్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా రుడా ఛైర్మన్, రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ పేరు ఖరారయ్యే అవకాశం ఉన్నట్టు పార్టీ శ్రేణుల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం మిగతా కమిటీల ప్రమాణ స్వీకారాలు మొదలయ్యాయి. ఒక్కో నియోజకవర్గంలో సుమారు 900 నుంచి 1500 మందికి వివిధ స్థాయిల్లో పార్టీ పదవులు దక్కాయి. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో ఏఎంసీ ఛైర్మన్ యద్ధనపూడి బ్రహ్మరాజు అతిథి గృహం వద్ద నియోజకవర్గంలోని మండల పార్టీ,గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో మంగళవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రమాణస్వీకారం చేయించారు.కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు మండలంలోని కమిటీల ప్రమాణ స్వీకారం మంగళవారమే జరిగింది. కొవ్వూరు పట్టణ, మండల కమిటీల ప్రమాణ స్వీకారం బుధవారం జరగనుంది. తాళ్లపూడి మండల కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం జరనుంది. మిగతా నియోజకవర్గాల్లో నియోజకవర్గ కమిటీలతో ఒకేసారి ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.రాజమహేంద్రవరం సిటీ, రాజానగరం,అనపర్తి నియోజకవర్గంలోని కమి టీలు ప్రమాణ స్వీకారం బుధవారం జరగనుంది. రాజమండ్రి రూరల్,నిడదవోలు కమిటీలకు మాత్రం గురువారం నిర్వహించనున్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితరులు

తల్లిదండ్రుల ఆశలకు విలువ ఇవ్వాలి

నన్నయ వర్శిటీ వీసీ ప్రసన్న శ్రీ

దివాన్‌చెరువు, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): విద్య ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ కష్టించి చదువుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. భారత తొలివిద్యశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. తొలుత వీసీ ప్రసన్నశ్రీ, విశ్వవిద్యాలయ అధికారులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలకు విలువనిచ్చి ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు.ప్రభుత్వ విద్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ తొలివిద్యాశాఖ మంత్రిగా చేసిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎ.మట్టారెడ్డి, వర్శిటీ అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అంతటా అప్రమత్తం



దేశ రాజధాని ఢిల్లీలో బాంబ్ పేలుడు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు.. జిల్లా వ్యాప్తంగా మంగళవారం అణువణువు తనిఖీ చేశారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జాతీయ రహదారులపై ఎక్కడికక్కడ వాహనాలను నిలుపుదల చేసి తనిఖీలు కొనసాగించారు. దీంతో వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు.

- ఫొటోగ్రాఫర్- రాజమహేంద్రవరం





లారీపై..భారీగా!



ఏంటీ నీటిలో ఉండాల్సిన పడవ లారీ ఎక్కిందని చూస్తున్నారా..! 18 చక్రాల లారీపై భారీ డ్రెజ్జింగ్ పడవను మంగళవారం విజయవాడ నుంచి కొవ్వూరు తీసుకువచ్చారు. ఎందుకో తెలుసా.. ఇంకెందుకు ఇసుక తవ్వకాలకేనండోయ్.. ఇంతవరకు అటు రాజమహేంద్రవరం, ఇటు కొవ్వూరులలో ఇసుక తవ్వకాల్లో వినియోగించే పడవల్లో ఇదే పెద్దది కావచ్చు. ఎందుకంటే ప్రస్తుతం బోట్స్‌మేన్ సొసైటీలు ఇసుక త్రవ్వకాలు చేపట్టే పడవలు 5నుంచి 6 పడవలు తీసుకువచ్చే ఇసుకను ఈ ఒక్క పడవే తీసుకువస్తుందని పడవ యజమానులు చెప్పుకుంటున్నారు. - కొవ్వూరు

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

● ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో వెంటాడుతున్న నిరుద్యోగాన్ని అధిగమించి యువతి, యువకులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. చెరుకుమిల్లి గ్రామంలో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీయల్ పార్కు భవన సముదాయ నిర్మాణానికి మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ నిరుద్యోగులైన యువతీ, యువకులు కూటమి ప్రభుత్వం అందించే చేయూతను అందిపుచ్చుకుని యువ పారిశ్రామికవేత్తలుగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధివైపు పయనిస్తుందన్నారు. రూ.11కోట్ల వ్యయంతో రెండున్నర ఎకరాల్లో నిర్మించే ఈభవన సముదాయంలో సుమారు 26 యూనిట్లు నెలకొల్పేందుకు వీలుందన్నారు. ప్రతీ యువకుడు ఒక పారిశ్రామికవేత్త కావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కలను సహకారం చేయాలంటే ఉన్నతమైన చదువులు చదవాలన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నైపుణ్యం ఉంటే ఎన్నో అవకాశాలు యువతను శక్తిగా తీర్చిదిద్దేందుకు ఉన్నాయన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో నిరుద్యోగాన్ని తరిమికొట్టి యువతీ, యువకులను ఉపాధివైపు నడిపించాలన్న తన సంకల్పానికి తొలిబీజం పడిందన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీయల్ పార్కు మంజూరుకు అనుమతి ఇచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు సభాముఖంగా కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నికల సమయంలో ఎంతోమంది నిరుద్యోగులు తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉన్నత చదువులు చదివిన ఈ ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్నామని తన దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. వారికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం శక్తికి మించి శ్రమించి ఇండస్ట్రీయల్ పార్కు మంజూరుతో తూర్పున తొలి అడుగు పడిందన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాయిప్రసాద్, ఎంపీడీవో రాజ్‌మనోహర్, టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి శ్రీరామచంద్రరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, చెరుకుమిల్లి సొసైటీ అధ్యక్షుడు గద్దే హరిబాబు, టీడీపీ సీనియర్ నాయకులు నూతంగి దొరబాబు, పడమటి సత్యనారాయణ, జ్యేష్ఠ శ్రీధర్, సమన్వయ కమిటీ సభ్యులు వేముల నాగరాజు, హోతా రాజాబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖాధికారులు, విద్యార్థులు తది తరులు పాల్గొన్నారు.


చెరుకుమిల్లిలో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీయల్ పార్కుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి , ఆర్డీవో రాణీసుస్మిత

పరిశ్రమల ఉపాధి కల్పనకు పెద్దపీట

నిడదవోలు(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలు ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తుందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని బసివిరెడ్డిపేట సమీపంలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ శంకుస్థాపన శిలా ఫలకం సీఎం నారా చంద్రబాబునాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నిడదవోలులో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ రెండుఎకరాల స్థలంను ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు కేటాయించామని, ఇందులో సుమారు 26యూనిట్లతో నిర్మాణం జరుగుతుందన్నారు. 13.12కోట్ల వ్యయంతో ఈ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. దీనిద్వారా పరిశ్రమలు ఉపాధి కల్పనకు పెద్దపీట వేయడమే అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ ఇంజనీర్ సుధాపద్మిని, జనసేన నాయకులు రంగా రమేష్, పోలిరెడ్డి వెంకటరత్నం పాల్గొన్నారు.


చాగల్లు టీడీపీ మండల కమిటీ, అనుబంధ సంఘాల నూతన కమిటీల సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కార్యకర్తలే టీడీపీకి బలం

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

చాగల్లు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా నూతన కమిటీల సభ్యులు బాధ్యతతో, పార్టీకోసం అంకిత భావంతోను పనిచేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం నెలటూరు శ్రీసీతారామస్వామి కళ్యాణమండపంలో తెలుగుదేశం పార్టీ మండల కమిటీ, గ్రామకమిటీలు, అనుబంధకసంఘాల సభ్యులు ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. కమిటీల సభ్యులచేత ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేయి ంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన సభ్యులు పార్టీ సిద్ధాంతాలకు, ఆశయాలకు కట్టుబడి సేవాభావంతో పనిచేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలలో కూటమి గెలుపు బాధ్యత నూతన కమిటీలదే అన్నారు. రాజకీయాల్లో రాణించాలంటే నాయకుడుకి ఓపిక, సహనం ఉండాన్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన చిటికెన పెంటారావు, కార్యదర్శి బొడ్డు కేశవకుమార్, చాగల్లు పట్టణ కమిటీ అధ్యక్షుడు దొంగ రామకృష్ణ సహా నూతన కమిటీల సభ్యులను పూలమాలతో సత్కరించి అభినందించారు. కొవ్వూరు నియోజకవర్గం పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్‌చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు, టీడీపీ నాయకులు కరుటూరి సతీష్, గారపాటి శ్రీనివాసరావు, కేతా సాహెబ్, వై.అబ్బులుచౌదరి, బొల్లిన శివనాగేంద్ర, కోడూరి కాశిగంగాధరరావు, తాళ్ళూరి ప్రసాద్, జొన్నకూలి సుబ్బారావు, ఈడుపుగంటి సుబ్బారావు, అల్తాఫ్ అహ్మద్, మనెల్లి నాని, పత్తిపాటి వెంకట సుబ్బారావు, అబ్బూరి సీతారాముడు, ఈడుపుగంటి మురళి అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కాలనీవాసుల తాగునీటి సమస్యను పరిష్కరించాలి

● ఎంపీపీకి దుద్దుకూరు కాలనీవాసుల వినతి


ఎంపీపీ కేవీకే దుర్గారావుకు వినతిపత్రం అందజేస్తున్న దుద్దుకూరు కాలనీవాసులు

దేవరపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దుకూరు గ్రామానికి చెందిన జగనన్నకాలనీవాసులకు మంచినీటి పైపులు వేసి సమస్యలు పరిష్కరించాలని వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం ఎంపీపీ కేవీకే దుర్గారావుకు దుద్దుకూరు కాలనీవాసులు అందజేశారు. ఈ సందర్భంగా దుద్దుకూరు కాలనీవాసులు నవీన్‌కుమార్, పొన్నాడ నాగరాజు, వి.సత్యవతి, డి.కుమార్ మాట్లాడుతూ మాకు జగనన్న కాలనీలో చింతమ్మచెరువు వద్ద 180 మందికి స్థలాలు ఇచ్చారని వందమంది వరకు ఇళ్లు కట్టుకున్నామని, 50మంది నివాసం ఉంటున్నామని మాకు నీళ్లలేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, బోరు వేసినప్పటికీ పైపులైన్లు లేక ఇళ్లకు నీరురావడంలేదని పంచాయతీ అధికారులను ఎన్నిసార్లు అడిగినా పట్టించు కోవడం లేదని ఎంపీపీ కేవీకే దుర్గారావుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను మంచినీటి పైపులైన్లు ఏర్పాటుచేయాలని నిధులు మండల పరిషత్ నిధుల నుంచి ఇస్తామని, కాలనీవాసుల సమస్యలు పరిష్కరిస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్కే రేష్మా, శ్రీలక్ష్మి, సత్యవతి, అచ్చెమ్మ, సత్యవతి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులకు అన్వేషించండి

● పంచాయతీ వనరుల జిల్లా ట్రైనింగ్ మేనేజర్ ప్రసంగిరాజు


గోపాలపురంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచాయతీ వనరుల జిల్లా ట్రైనింగ్ మేనేజర్ ప్రసంగిరాజు

గోపాలపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో పంచాయతీరాజ్ చట్టంలో పొందుపరచిన ఆదాయవనరుల అన్వేషణపై సర్పంచ్‌లు, కార్యదర్శులు దృష్టిసారించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పంచాయతీ వనరుల జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జీ.ప్రసంగిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు ఆదాయవనరుల అన్వేషణపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ ప్రసంగిరాజు మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి అంటే ఆర్థిక సంఘం నిధులు ఇంటి, కుళాయిపన్నులపై వచ్చే ఆదాయం కాదన్నారు. గ్రామం లో ఆదాయం లభించే ఆయా వనరులను అన్వేసించి తద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీని అభివృద్ధి పదంవైపు నడిపించాలన్నారు. ముఖ్యంగా పంచాయతీ పరిధిలో చెరువులు, ఫలసాయాన్ని ఇచ్చేచెట్లు, మొ దలగు ఆదాయాన్ని సమకూర్చే వనరులను పాలకవర్గ సభ్యులు, గ్రామస్థుల సహకారంతో సమాలోచనలు జర పాలన్నారు. ఆదాయం తెచ్చే వనరులను ఎప్పటికప్పు డు పర్యవేక్షిస్తూ భవిష్యత్‌తరాలకు వనరులను ఇచ్చే విధంగా వాటిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సొంత ఆదాయ వనరులు పెంచుకోవాలి

ఉండ్రాజవరం(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలు సొంతఆదాయవనరులను పెంచుకోవాలని ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వ గ్రాంటుతోపాటు వనరులను సమకూర్చుకోవాలని సూచించారు. ఇంటి పన్నులు, చెరువులద్వారా ఆదాయం వంటి వనరులను పెంచుకుని ఆదాయం రాబట్టాలని ఆయన వివరించారు. డిప్యూటీ ఎంపీడీవో కె.ఆంజనేయశర్మ మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమసేవలు అందించాలంటే, ఆదాయాలు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆఫీసు ఏవో వీఎస్ రామారావు, ప్రోగ్రాం మాస్టర్ ట్రైనర్ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులను సృష్టించుకోవాలి

నల్లజర్ల(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు సొంతంగా ఆదాయ వనరులు సృష్టించుకోవాలని నల్లజర్ల ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. మంగళవారం నల్లజర్ల ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు సొంత ఆదాయ వనరులపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలు అభివృద్ధి చెందే విధంగా సంపద సృష్టికి కలిగించేందుకు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారిస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆర్థిక సంఘం నిధులు, ఇంటి పన్నుల సాధారణ నిధులకోసం వేచి చూడాల్సిన అవసరం ఉండదన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో పంచాయతీలు కీలకపాత్ర పోషి స్తాయన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సింహాద్రిరావు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కార్యదర్శులు కృషిచేయాలి

దేవరపల్లి(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో ఆర్థిక సంపద పెంపొందించుకోవడానికి కార్యదర్శులు సర్పంచ్‌లు కృషిచేయా లని ఎంపీడీవో సీహెచ్.నాగార్జునరావు అన్నారు. దేవరపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రామపంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో నాగార్జునరావు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో చెత్త నుంచి సంపద సృష్టించాలని, పంచాయతీలు ఆర్థికంగా పుంజుకోవాలని ఇంటి, కుళాయిపన్నులు, భవనాల అప్రూవల్స్‌పై సక్రమంగా నిధులు సమకూర్చుకోవాలని సూచించారు. ఈవోపీ ఆర్డీ రాజారావు మాట్లాడుతూ గ్రామాల్లో తడి,పొడి, చెత్తపై అవగాహన కోసం ప్రతీ గ్రామంలోనూ సీఆర్‌పీలను నియమిస్తామని కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీవై ఎంపీడీవో వై.రాజా రావు, సూపరింటెండెంట్ శాంతి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణ పనులు ఆపండి

● అడ్డుకున్న పరిసర ప్రాంతాల ప్రజలు


జనావాసాల మధ్య సెల్‌టవర్ నిర్మాణం నిలుపుదల చేయాలని ప్రజలు ఆందోళన

కొవ్వూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణం నిలుపుదల చేయాలని ప్రజలు ఆందోళన చేపట్టారు. కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో మెయిన్‌రోడ్‌పై ఉన్న రంగాప్రసాద్ షాపింగ్ కాంప్లెక్స్ భవనంపై జరుగుతున్న హైగ్రేడు పవర్‌సెల్ టవర్ నిర్మాణ పనులను పరిసర ప్రాంతాల ప్రజలు అడ్డుకున్నారు. మద్దుకూరి దొర య్య మాట్లాడుతూ జనావాసాల మధ్య సెల్‌టవర్ నిర్మాణం చేపట్టరాదని ఎమ్మె ల్యే, మున్సిపల్, ఆర్డీవో కార్యాలయాల్లో నెలరోజుల క్రితం వినతిపత్రాలు అందిస్తామన్నారు. టవర్‌నిర్మాణ పనులను నిలుపుదల చేస్తామని అధికారులు చెప్పారు. మరలా మంగళవారం ఉదయం టవర్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రజలంతా కలిసి అడ్డుకుంటున్నామన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు అధికంగా ఉన్నారు. జనావాసాల మధ్య సెల్‌టవర్ నిర్మాణానికి ఎలాఅనుమతిస్తారని ప్రశ్నించారు. యాగంటిశ్రీను, ఎన్.శివరామకృష్ణ, నున్నసాయి, 6, 22 వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుల ఇంటి నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదానికిగురై నిరాశ్రయులైన వారికి ఎఫ్రాయిమ్ గ్లోబల్ చారిటబుల్ ట్రస్టు అండగా నిలవడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి చైర్‌పర్సన్ రత్నకుమారి అన్నారు. కొవ్వూరు పట్టణంలోని 4వ వార్డులో అగ్ని ప్రమాదానికిగురై నిరాశ్రయులైన విప్పర్తి సుబ్బాయమ్మ ఇంటి నిర్మాణానికి ఎల్‌సీవో ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ ఫౌండర్ గడ్డం విలియమ్స్, ఎఫ్రాయిమ్ గ్లోబల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి భూమి పూజచేశారు. కార్యక్రమంలో డా.జి.మనీషా, జి.మధు, జి.రాహుల్, కె.జోసఫ్, కె.సంతోష్, పాస్టర్స్ ఫెలోషిప్ సేవకులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులపై దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో రాజారావు

ఉండ్రాజవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన ఎరువులపై దృష్టిసారించాలని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు పేర్కొన్నారు. మంగళవారం భూమాత రక్షణ కార్యక్రమంలో భాగంగా ఉండ్రాజవరంలో రైతులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువులను వినియోగించడం వలన సాగు ఖర్చు తగ్గుతుందని, తద్వారా అధిక ఉత్పాదకత సాధించడం వలన రైతుల ఆదాయం పెరుగుతుందని ఆయన వివరించారు. పాలంగి, కె.సావరం, మోర్త, తాడిపర్రు, వెలగదుర్రు, చివటం గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

'భూసారం పెంచుకోవాలి'

నల్లజర్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): రైతులు పరి మితికిమించి ఎరువులు పురుగుమందులు ఉపయోగించకుండా పశువుల పేడ, పచ్చిరొట్టతో భూసారాన్ని పెంచుకోవాలని ఏవో సోమశేఖర్ అన్నారు. మంగళవారం అయ్యవరంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమాత రక్షణ కార్యక్రమం ద్వారా రైతులకు చెందిన భూముల్లో సూక్ష్మజీవులు ఏవిధంగా చనిపోతున్నాయి. యూరియా అతిగా వాడటం వల్ల భూమికి రక్షణ లేకుం డాపోతుందని పేర్కొన్నారు. సమతుల్య ఎరువులు, పురుగు మందులు వాడుకోవాలని కోరారు. చెట్ల పెంపకంద్వారా భూమి సారవంతం అవుతుందన్నారు. భూసారాన్ని పెంచుకుంటే రాబోయే రోజుల్లో మన పిల్లలవరకు భూమి పదిలంగా ఉంటుందన్నారు. ప్రతి రైతు బాధ్యతగా భూమి రక్షణకు కృషి చేయాలన్నారు.

వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే

ఉండ్రాజవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైద్యసిబ్బంది ఇంటింటా వెళ్లి శ్వాసకోశ వ్యాధులపై అవగాహన సర్వే నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు మంగళవారం తెలిపారు. తమ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 5 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు ఉంటే వాటిని తగ్గించేందుకు అవసరమైన సలహాలు అందిస్తారని తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలపై తలిదండ్రులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న వారికి జలుబు, దగ్గుతో కూడిన జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే తమ సిబ్బందికి తెలియజేయాలని డాక్టర్ దుర్గామహేశ్వరరావు కోరారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గోపాలపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతంగా జీవించాలని చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. మండలంలోని చిట్యాల గ్రామంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రాపాక ఫణికిషోర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు ఆశ్రం ఆసుపత్రి ఆయా విభాగాలకు చెందిన వైద్యులు, వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజమనో హర్ మాట్లాడుతూ సామాజిక సేవకు ప్రతి రూపం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అ న్నారు. విద్యా, వైద్య విభాగాల్లో మానవత అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న వ్యక్తికి సాయపడాలనే తపన, తాపత్రయం మానవత స్వచ్ఛంద సంస్థలో చూడవచ్చని అన్నారు. కార్యక్రమంలో మానవత మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, ఏఎస్‌వో జొడాల వెంకటేశ్వరరావు, మానవ త స్వచ్ఛందసేవా సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో పరీక్షా కేంద్రాల తనిఖీ


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎగ్జామినేషన్స్ అధికారిణి అమలకుమారి

నిడదవోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిడద వోలు పట్టణ మండలంలోని 10వ తరగతి పరీక్షలకు సంబంధించిన 9పరీక్షా కేంద్రాలను మంగళవారం అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ అధికారిణి ఎం.అమలకుమారి పరిశీలించారు. అనంతరం అధికార్లతో మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలవద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు వందరోజుల పరీక్షా ప్రణాళికపై చర్చించారు. ఆమె వెంట మండల విద్యా శాఖాధికారి పి.గురుమూర్తి, ఏపీ ఉమామహేశ్వరరావు, ఎం.రమేష్‌రాజు ఉన్నారు.

అందెశ్రీకి ఘన నివాళి


అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తాళ్లపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కవి, రచయిత, వాగ్గేయకారుడు అందెశ్రీ మృతికి సంతాపం తెలియజేస్తూ విజేతా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జేవీ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వి ద్యార్థులు అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో భాగంగా అకడమిక్ ఇంచార్జి కరుణ మాట్లాడుతూ అందేశ్రీ ప్రజాకవిగా, ప్రకృతి కవిగా ప్రసిద్ధి చెందారని ఆయన రచించిన జయ జయహే గీతం తెలంగాణా రాష్ట్ర గీతంగా ఎంపికకావడం గర్వించ తగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి

కొవ్వూరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని కొవ్వూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు మండలం ఐ.పంగిడి జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. భారతదేశ మొట్టమొదటి కేంద్ర విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని విద్యాదినంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రామారావు, శాస్త్రి, మధులత, షేక్ రషీద, రవికుమార్, అరుణకుమారి, కృష్ణవేణి, రమాదేవి, సుసన్నరాణి, రాజులమ్మ పాల్గొన్నారు.


మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయస్థాయికి దేవరపల్లి క్రీడాకారులు


జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్

దేవరపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపాలెంజిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడాకారులు జాతీయస్థాయి సెపక్‌తక్రాపోటీలకు ఎంపికయ్యారని రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. రామన్న పాలెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన యండ్రపాటి ఆంథోని రాష్ట్రస్థాయి పోటీల్లో దుద్దుకూరులో జరిగిన అండర్ 17 విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, ఈ పోటీలు డిసెంబర్ 15 నుంచి 22వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలో జోద్‌పూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంథోని పాల్గొంటాడని తెలిపారు. అండర్ 14విభాగంలో సెపక్‌తక్రా పోటీల్లో రామన్నపాలెం హైస్కూల్ విద్యార్థి జొన్నకూటి హర్ష జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు తెలంగాణలో జరిగే పోటీల్లో హర్ష పాల్గొంటారని తెలిపారు. ఈ క్రీడాకారులను పీడీ తలారి సరస్వతి అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు దేవేందర్ ఎంపిక


విద్యార్థి దేవేంద్రను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చాగల్లు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిక్కాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఇల్ల దేవేంద్ర (8వ తరగతి) రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. అండర్-14 బాలుర విభాగంలో దేవేందర్ జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. మంచి ప్రతిభను కనపరచిన క్రీడాకారుడు దేవేంద్రను వ్యాయామ ఉపాధ్యాయుడు తంగెళ్ళ గంగాధరరావు, ప్రధానోపాధ్యాయుడు ఎం.నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ చిటికెన పెంటారావు, సొసైటీ అధ్యక్షుడు వై.అబ్బులుచౌదరి, మాజీ వైస్ ఎంపీపీ కె.రామూర్తి అభినందించారు.

నిడదవోలులో విస్తృత తనిఖీలు

నిడదవోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పట్టణంలోని ఆర్టీసీ డిపో, రైల్వేస్టేషన్‌లలో నిడదవోలు పోలీస్ సర్కిల్ అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. దేశ రాజధాని డిల్లీలో జరిగిన కారు బాంబు పేలుడు దృష్టిలో ఉంచుకుని ఈ తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. ఈ తనిఖీలలో ఎస్ఐలు జగన్ మోహనరావు, పరమహంస, కె.కల్పన సిబ్బంది పాల్గొన్నారు.


నిడదవోలు ఆర్టీసీ డిపోలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ అధికార్లు, సిబ్బంది